
జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 15, డిసెంబర్ 2024 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం



# ఎన్టీఆర్‌కు భారతరత్న సాధిస్తాం



- తెలుగు ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడు ఎన్టీఆర్
- సినీ, రాజకీయ రంగాల్లో ఎన్టీఆర్‌ది చెరగని ముద్ర
- జాతీయ భావాలతో ప్రాంతీయ పార్టీ నడిపిన ఏకైక వ్యక్తి ఎన్టీఆర్
- ఎన్టీఆర్ స్ఫూర్తితో స్వర్ణాంధ్ర విజన్-2047 కల సాకారమవుతుంది
- ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు
- సినీ ప్రస్థానంపై రూపొందించిన 'తారక రామం' పుస్తకం ఆవిష్కరణ
- టీడీ జనార్ధన్ కృషిని మెచ్చుకున్న చంద్రబాబు







**అమరావతి,మహానాడు:**

'తెలుగుజాతి ఆత్మగౌరవం, పౌరుషం అంటే గుర్తొచ్చేది ఎన్టీఆర్. ఎన్టీఆర్ స్ఫూర్తితో స్వర్ణాంధ్ర విజన్ 2047 కల సాకారం చేసుకుందాం. మనకు తెలిసిన, మనం చూసిన ఏకైక యుగపురుషుడు ఎన్టీఆర్' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. పోరంకిలో ఎన్టీఆర్ లిటరేచర్-సావనీర్ అండ్ వెబ్ సైట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. వేదికపై ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఎన్టీఆర్ సినీ ప్రస్థానంపై రూపొందించిన 'తారకరామం' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి వచ్చిన అతిథులు, సినీ ప్రముఖులను ఆప్యాయంగా పలకరించారు. అనంతర సీఎం చంద్రబాబు ప్రసంగించారు.

### చరిత్ర ఉన్నన్నాళ్లు ఎన్టీఆర్ ఉంటారు

'ఎన్టీఆర్ సినీ ప్రస్థానానికి నేటితో 75 ఏళ్లు. ఎన్టీఆర్ వజ్రోత్సవ వేడుక అపూర్వ ఘట్టం. గతేడాది ఎన్టీఆర్ శత జయంతి జరుపుకున్నాం. ఏడాది మొత్తం ప్రపంచమంతా ఉత్సవాలు చేసుకున్నాము. యుగపురుషుడు పుట్టినప్పుడు చరిత్ర మర్చిపోదు అనడానికి ఎన్టీఆర్ ఉదాహరణ. 75 ఏళ్ల సినీ వజ్రోత్సవ వేడుక చేసుకోవడం, ఈ వేదికపై అందరం కలుసుకోవడం సంతోషాన్నిస్తోంది. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లిన తెలుగుజాతి పేరు వింటే ముందుగా మనకు గుర్తొచ్చేది ఎన్టీఆర్.

చరిత్ర ఉన్నంతవరకూ తెలుగువారి గుండెల్లో ఆయన ఉంటారు. చిన్నరైతు బిడ్డ నుంచి తెలుగు సినీ చరిత్రలో ఎవరెస్టు శిఖరంగా ఎదిగి, పార్టీ పెట్టిన 9 నెలల్లోనే ముఖ్యమంత్రి కావడం చరిత్రలో ఎక్కడా జరగలేదు. భవిష్యత్‌లోనూ జరగదు. ఇటు వెండితెర, అటు రాజకీయాలను ఏలిన ఏకైక నాయకుడు దేశ చరిత్రలో ఒక్క ఎన్టీఆర్ మాత్రమే. రంగం ఏదైనా ఆయన అడుగుపెట్టిన ప్రతి చోట సువర్ణాధ్యాయమే.

### తెలుగు సినీ పరిశ్రమపై చెరగని ముద్ర ఎన్టీఆర్

'ఎన్టీఆర్ తొలిసారి నటించిన మనదేశం చిత్రం విడుదలైన 75 ఏళ్లు. ఎన్టీఆర్ మొదటి సినిమా హీరోయిన్ కృష్ణవేణి. 102 సంవత్సరాల వయసులోనూ ఈ వేడుకకు ఆమె హాజరుకావడం ఎంతో గొప్పవిషయం. కారణజన్ముల చరిత్ర మనం గుర్తు చేసుకోని స్ఫూర్తి పొందాలి. నిమ్మకూరులో వెంకట్రావమ్మ, లక్ష్మయ్య చౌదరి

మిగతా.. 2లో



తెలంగాణ తల్లి మన తల్లుల ప్రతిరూపం

4లో



అప్రజాస్వామికంగా సాగునీటి సంఘాల ఎన్నికలు

4లో



చేయని తప్పుకు జైల్లో వేశారు

5లో



విడదల రజనీ, లేళ్ల అప్పిరెడ్డి దగ్గర పనిచేసే మనుషులు నా కూతురుని హత్య చేశారు!


6లో

## అర్జున్ అరెస్టు.. జైలు.. బెయిల్
# సినిమా సూపర్ హిట్

- ఇలాంటి న్యాయం సామాన్యులకు దక్కేనా
- సెలెబ్రిటీలకు ఒక న్యాయం, సామాన్యులకు ఒక న్యాయం అని భావించే పరిస్థితి

**హైదరాబాద్, మహానాడు:**

టాలీవుడ్ హీరో అల్లు అర్జున్ అరెస్టు, జైలు, బెయిల్ సినిమా సూపర్ హిట్. ఈ వ్యవహారంలో పోలీసులు నడిపిన కథ, కోర్టు ఇచ్చిన క్లైమాక్స్ బంపర్ హిట్. కేవలం 12 గంటల వ్యవధిలోనే సెలెబ్రిటీ అల్లు అర్జున్ అరెస్టు కావడం, పోలీసుల విచారణ ఎదుర్కొవడం, జైలుకు వెళ్లడం, బెయిల్ పై హీరోగా బయటికి రావడం అంతా పుష్ప -2 ప్రీమియర్ షో ను తలదన్నేదిగా ఉంది.



హైదరాబాద్ సంధ్య థియేటర్ లో పుష్ప-2 సినిమా చూడటానికి అల్లు అర్జున్ వచ్చినప్పుడు చోటు చేసుకున్న తొక్కిసలాటలో ఒక మహిళ మృతి చెందింది. ఆమె కుమారుడు ఆసుపత్రిలో చావు బతుకుల మధ్య పోరాడుతున్నాడు. ఈ ఘటనకు సంబంధించి అల్లు అర్జున్ ను పోలీసులు అరెస్టు చేశారు. అంతకు ముందే పలువురిని పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించారు. అయితే, అల్లు అర్జున్ అరెస్టు వ్యవహారంలో హైడ్రామా చోటు చేసుకుంది. పోలీసులు,

మిగతా.. 2లో



### అర్జున్‌కు మద్దుతు సరే.. ఈ పేదోడిని పరామర్శించరేం

**హైదరాబాద్, మహానాడు:**

కిమ్స్ హాస్పిటల్‌లో మృత్యువుతో పోరాడుతున్న అల్లు అర్జున్ అభిమాని శ్రీతేజ్.. సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాటలో చనిపోయిన రేవతి కొడుకు శ్రీతేజ్.. అదే రోజు తల్లితోపాటు తొక్కిసలాటలో చిక్కుకుపోయి ఆసుపత్రి పాలై ప్రస్తుతం ఈ పరిస్థితుల్లో ఉన్నాడు. అల్లు అర్జున్‌ని పరామర్శిస్తున్న ఏ ఒక్కరైనా చనిపోయిన రేవతి.. కుటుంబాన్ని పలకరించారా పేదోడికి ఒక న్యాయం .. పెద్దోడికి ఒక న్యాయమా?..

## హనుమంతుడు వివాహితుడా? అవివాహితుడా?

హనుమంతుడు అవివాహతుడనే చాలామందికి తెలుసు. ఆయన బ్రహ్మచారి అన్నది లోకం నమ్మిక. కానీ ఆయన వివాహితుడేనని శాస్త్రం చెబుతోంది. మరి హతుమంతుడు వివాహితుడా అవివాహితుడా ఓసారి చూద్దాం!



ఆయనను సువర్చలా సహిత హనుమ అని పిలుస్తారు. సువర్చలా సహిత హనుమకు కళ్యాణం చేయడం శాస్త్రంలో అంగీకరించారు. ఎందుకంటే గృహస్థాశ్రమంలోకి వెళ్ళకుంటే పెద్దలైనటువంటివారు తరించరు.

శాస్త్రంలో హనుమకు ప్రవర ఉన్నది. తండ్రిగారు కేసరి, తాతగారి పేరు, ముత్తాతగారిపేరు కళ్యాణంలో చెప్తారు. హేమగర్భుడు అని వారి ముత్తాతగారి పేరు. ఒకతండ్రి కడుపున పుట్టిన పిల్లవాడు వివాహం చేసుకోకుండా ఉండిపోతే, తల్లిదండ్రులు దేహములు చాలించిన తరువాత వారి శరీరాలను చెట్లకి త్రిప్పి కట్టేస్తారు.

మిగతా.. 2లో

## సభ్యత్వ నమోదులో
# టీడీపీ సరికొత్త రికార్డు

- 73 లక్షలకు చేరుకున్న తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలు
- క్యాడర్, నాయకులకు సీఎం అభినందనలు
- టాప్ - 5లో రాజంపేట, నెల్లూరు సిటీ, కుప్పం, పాలకొల్లు, మంగళగిరి నియోజకవర్గాలు
- నూతన సభ్యత్వాలకు తోడు పెద్ద సంఖ్యలో యువత, మహిళల మెంబర్ షిప్
- క్యాడర్ వెల్ఫేర్‌తో పాటు పొలిటికల్, ఎకనమిక్ ఎంపర్మెంట్ కోసం ప్రణాళికలు
- టీడీపీ అధినేత, సీఎం నారా చంద్రబాబు నాయుడు



**అమరావతి, మహానాడు:**

సభ్యత్వ నమోదులో తెలుగుదేశం పార్టీ(టీడీపీ) సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. అక్టోబర్ 26న సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం కాగా.... శనివారం నాటికి 73 లక్షలకు చేరింది. సభ్యత్వాల నమోదుపై పార్టీ కేంద్ర కార్యాలయంలో నేతలతో సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష చేశారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నేతృత్వంలో సభ్యత్వ కార్యక్రమం జరుగుతోంది. సభ్యత్వ నమోదు అంశాలను ఆ విభాగ ప్రతినిధులు చంద్రబాబుకు వివరించారు. దాదాపు 73 లక్షల మంది సభ్యత్వం తీసుకోగా..ఇందులో 85 వేల మంది తెలంగాణ రాష్ట్రం నుంచి పొందారు. ఇప్పటి వరకు జరిగిన నమోదులో 54 శాతం మంది కొత్త వారు సభ్యత్వం తీసుకున్నారు. సభ్యత్వ నమోదులో 1.18 లక్షలతో రాజంపేట మొదటి స్థానంలో ఉండగా, నెల్లూరు సిటీలో 1.06 లక్షలు, కుప్పంలో 1.04 లక్షలు, పాలకొల్లులో 1.02 లక్షలు, మంగళగిరిలో 90 వేల సభ్యత్వాలు నమోదయ్యాయి. సభ్యత్వ కార్యక్రమంపై చంద్రబాబు సంతృప్తి వ్యక్తం చేశారు.

మిగతా.. 2లో

## జమిలి అమల్లోకి వచ్చినా, ఎన్నికలు జరిగేది 2029లోనే

- రేపటి తరం భవిష్యత్తు కోసమే విజన్ 2047
- స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్ ఒక రోజు పెట్టి వదిలేసేది కాదు
- ఆనాడు ఏపీ అభివృద్ధిలో అద్వానీ సహకారం మరువలేనిది
- మీడియాతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇష్టాగోష్టి

**విజయవాడ, మహానాడు:**

జమిలి అమల్లోకి వచ్చినా, ఎన్నికలు జరిగేది 2029లోనే. ఒక దేశం, ఒకే ఎన్నిక విధానానికి ఇప్పటికే మా మద్దతు ప్రకటించా. వైసీపీ పబ్బం గడుపుకోవడానికి ఏదిపడితే అది మాట్లాడుతోంది. వైసీపీ నేతలు ప్రజల్లో ఎప్పుడో విశ్వసనీయత కోల్పోయారు. వైసీపీ చేసే నాటకాలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వం కొనసాగుతోంది.

మిగతా.. 2లో

జనం గుండె చప్పుడు
# మహానాడు
2
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 15, డిసెంబర్ 2024




టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు కుమారుడి వివాహానికి సీఎం చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో వధూవరులు ఆకాష్, నరసమ్మను సీఎం చంద్రబాబు ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

## హనుమంతుడు వివాహితుడా? అవివాహితుడా?

(మొదటిపేజీ తరువాయి..)
ఎందుకంటే నువ్వు వివాహం చేసుకోనటువంటి సంసార భ్రష్టుడిని కన్నావు కనుక అని. అందుకని పిల్లలు వివాహం చేసుకోకుండా ఉండకూడదు. అలా చేయడం తల్లిదండ్రులయొక్క ప్రధానమైన బాధ్యత. నవ వ్యాకరణ పండితులు, మహా బుద్ధిమంతుడైన హనుమ వివాహం చేసుకోకుండా అటు సన్యాసం తీసుకోకుండా ఉండరు కదా! మీకు అందుకే భారతీయ సంప్రదాయంలో ఋషులందరూ వివాహం చేసుకొని ఉంటారు. అలాగే హనుమ కూడా శాస్త్ర మునకు సంబంధించినంతవరకు గృహస్థాశ్రమంలో ఉంటారు. కాపురం చేసినట్లు, పిల్లల్ని కన్నట్లు లేదు. ఎందుకంటే ఆయన బ్రహ్మజ్ఞాని. అందుచేత సువర్చలను వివాహం చేసుకున్నారు. ఇద్దరూ యోగమును అనుసంధానం చేశారు.

## సభ్యత్వ నమోదులో
# టీడీపీ సరికొత్త రికార్డు

(మొదటిపేజీ తరువాయి..)
సభ్యత్వ కార్యక్రమంతో పార్టీ బలమైన కార్యకర్తల ఆర్మీని తయారు చేస్తామని సీఎం అన్నారు. ప్రతి నలుగురిలో ఒకరు తెలుగుదేశం సభ్యత్వం పొందే పరిస్థితి రావాలని చంద్రబాబు అన్నారు. తెలుగుదేశం కార్యకర్తలకు సంక్షేమం అందించడంతో పాటు రాజకీయంగా, ఆర్థికంగా ఎంపవర్ చేసే కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో అమలు చేస్తామన్నారు.

స్కిల్ డవలెప్మెంట్, అవకాశాలు కల్పించడం, ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలకు ప్రాధాన్యత క్రమంలో అందించడం ద్వారా ఆర్థికంగా వాళ్లు నిలదొక్కుకునే కార్యక్రమాలు చేపట్టాల్సి ఉందని సిఎం అన్నారు. కేవలం వెల్ఫేర్ మాత్రమే కాకుండా కార్యకర్తల తలసరి ఆదాయం పెంపుకు చర్యలు తీసుకుంటామని చంద్రబాబు అన్నారు. దీనిపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్టు సీఎం తెలిపారు. కష్టపడి పని చేసిన వారికి మెరిట్ పద్దతిలో పదవులు ఇవ్వడంతో పాటు...ఆయా కుటుంబాలను ఆర్థికంగా నిలబెట్టే కార్యక్రమం పార్టీలో అన్ని స్థాయిలో జరుగుతుందన్నారు. అనంతరం పార్టీకి చెందిన ఇతర విభాగాల పని తీరుపైనా చంద్రబాబు సమీక్షించారు.

### పెండింగ్ బిల్లుల సమస్య పరిష్కార బాధ్యత అప్పగింత

గత వైసీపీ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపులో భాగంగా నీరు చెట్టు, నరేగా బిల్లులను నిలిపివేసిందని, ఇప్పటికే కొంత మేర బిల్లులు ఇచ్చామని....మిగిలిన మొత్తం కూడా త్వరలో చెల్లిస్తామని సీఎం చెప్పారు. నాడు పనులు చేసి బిల్లులు రాక ఇబ్బంది పడుతున్నవారి సమస్యల పరిష్కారాన్ని ముగ్గురు మంత్రులకు అప్పగిస్తూ చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు ఈ అంశంపై ఎప్పటికప్పుడు చర్చించి.... ప్రభుత్వం నుంచి నిబంధల ప్రకారం బిల్లులు మంజూరు అయ్యేలా చూసే బాధ్యతను అప్పగించారు.

## జగన్‌ని నమ్మని
# ఆ "నలుగురు"

రాజకీయలలో ఇప్పటి జమానా లో హత్యలు, ఆత్మహత్యలు రెండు సమాంతరం గా చలామణి లో సాగడం నిత్య కృత్యం అయింది. పూర్వం ఆ రెండిటిలో ఒక్కటే శరణ్యం అనేది నానుడి. ప్రాంతీయ పార్టీల కు సమానంగా జాతీయ పార్టీలు సైతం పోటాపోటీగా ఎన్నికల్లో నెగ్గడం కోసం, ఖజానా శక్తి కి మించి, ప్రజల వాస్తవ అవసరాన్ని మించి వాగ్దానాలు అలవోకగా గుప్పి0చే ప్రక్రియ దశాబ్దాల నుంచి ఉన్నా, జగన్ పార్టీ ఆవిర్భావం తర్వాత నే ప్రభుత్వ పరిపాలనకు, ఇవి కొరకు రాని కొయ్య గా తయారయ్యాయి.



సంక్షేమ పథకాలు అర్హులకు అందించడం నిరభ్యంతరంగా ప్రజలకు అవసరమే, ప్రభుత్వాలు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అయితే వీటి ముసుగులో జరిగిన తంతు ఏమిటి సన్న బియ్యం ఇస్తామని వాగ్దానం చేయడం, ఆచరణలో ముతక బియ్యం ముసుగులో కాకినాడ పోర్టు లో జరిగిన మోసం, కుంభ కోణం వెనుక అప్పటి ముఖ్యమంత్రి అత్యంత సన్నిహితులు పరోక్షంగా ప్రభుత్వ అండదండలు.. వెరసి ఆంధ్ర రాష్ట్ర పరువు, ప్రఖ్యాతలు బంగాళాఖాతంలో కలిసిపోయినవి. వీలు అయిన వరకు డబ్బు పోగేసు కోవాటం , అవి సీ పోర్ట్ లు అడ్డంగా రాసి ఇవ్వటం దగ్గర నుంచి.. అడ్డంగా కరెంట్ కొనుగోలు ఒప్పందాలు దరిమిలా ప్రజల పై కరెంట్ బిల్లుల రూపంలో మోయలేని భారాన్ని మోపడం. మద్యం, ఇసుక మాఫియా లకు తోడుగా విశాఖపట్నం రాజధాని పేరుతో చేసిన ఆర్థిక విన్యాసాలు, బలవంతంపు భూ ఆక్రమణలు, అయిన వాళ్లకు కావలసినంత దోచిపెట్టడం. అందులో ముఖ్యంగా ఆ "నలుగురు " కోసం!

. చివరికి కాటికి నలుగురు అవసరం అయినా, చిత్రంగా ఆ నలుగురే ఇంత దోచి పెట్టిన జగన్ ని ప్రస్తుతం ఓర చూపు చూడటం గమనిస్తే.. రాజకీయ లలో హత్యలు, ఆత్మహత్యలు రెండూ సాధ్యం అన్నది నిఖార్సయిన నిజం. సరే ఇది ఒక ఎత్తయితే , జగన్ ని అధికారంలో కూర్చో బెట్టింది 51% రాష్ట్రంలో అన్ని సామాజిక వర్గాలు. జగన్ రెడ్డి మాత్రం కేవలం 6% కూడా లేని వారి సామాజిక వర్గానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వటం. అందులో నలుగురు సామంతరాజులుగా రాష్ట్రంలో నాలుగు దిక్కు లకు దిక్పాలకులుగా విర్రవీగడం. ఫలితమే వారికి మొన్న ఎన్నికల్లో దక్కిన పదకొండుతో మూడవ స్థానం.

ఏ రాజకీయ పార్టీలకు అయినా అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని కులాలు, మతాల కు సమానంగా అవకాశాలు కల్పించాలి. అది సంపూర్ణంగా కొరవడిన నేపథ్యంలో అంతర్లీనంగా పెరిగిన అసంతృప్తి కి తోడుగా.. నాయకుల విశృంఖల అవినీతి, అరాచకం కలగలసి జగన్ అధికారాన్ని ప్రజలు పాతేశారు. భారత దేశంలో జగన్ పరిపాలన పార్టీలకు, వివిధ ప్రభుత్వలకూ ఒక "కేసు స్టడీ " లాంటిది. విభజిత ఒక చిన్న రాష్ట్రం, పరిపాలన దక్షత లేమితో ఏ విధంగా అప్పుల ఊబిలో కొట్టు మిట్టాడుతూ.. అభివృద్ధి, సంపద సృష్టి సహజ వనరుల వినియోగం పై దృష్టి సాధించడం మరిచి, కేవలం డబ్బు కొల్ల గొట్టాలను కోవడం జగన్ పతనానికి మూల కారణం.

చింపిన విస్తరిలా తయారు చేసిన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకు రావడం అంత ఆషామాషీ వ్యవహారం అయితే కాదు. కానీ ఒక ఆశ, భరోసా ఈ రాష్ట్ర ప్రజల్లో ఇప్పుడు ఉందంటే అది చంద్ర బాబు విజన్, సంపద సృష్టి లో వారికి ఉన్న అనుభవం, కార్యదక్షత, అభివృద్ధి పై కసి- పట్టుదల, ఇప్పటికీ మెండుగా ఉండటమే. అందుకే గతంలోలో కాకుండా, ఈ దఫా కూటమితో నెగ్గుకు రాగలుగు తారన్న నమ్మకం ప్రజల్లో మెండుగా ఉంది.

జాతీయ రాజకీయాల్లో ఈ రాష్ట్రం సంఖ్యా పరంగా శాసించే స్థానంలో ఉన్నా.. రాష్ట్ర అభివృద్ధికి కావలసిన వనరులు సాధించడంలో, కాస్త వెనకబడే ఉన్నామన్న మాట అంగీకరించ వలసిన విషయం. ఆ దిశగా కూటమి సమిష్టి గా కదం కదం కలిపితే, అనుకున్న లక్ష్యం సాధించడం గొప్ప విషయం కాక పోవచ్చు. ఎందుకంటే గత జగన్ ప్రభుత్వం కూడా కేంద్రంతో అత్యంత సన్నిహితంగా ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడడంలో పూర్తిగా విఫలమయ్యారు.

జమిలి ఎన్నికలు ముందస్తుగా వచ్చినా రాకపోయిన చంద్ర బాబు, కూటమి నాయకులు సమైక్యంగా చెప్పిన హామీలు అన్ని సకాలంలో పూర్తి చేసి భారత దేశ పటంలో ఆంధ్రప్రదేశ్‌ని సగర్వంగా నిలపగలర న్న సంపూర్ణ విశ్వాసంతో ప్రజలు ఉన్నారు.



- ఓ.వి.రమణ
టీటీడీ బోర్డు మాజీ పాలక మండలి సభ్యులు
తెలుగు దేశం పార్టీ నాయకులు

# అర్జున్ అరెస్టు.. జైలు.. బెయిల్ సినిమా సూపర్ హిట్

(మొదటిపేజీ తరువాయి..)
న్యాయ వ్యవస్థలు రోజంతా పని చేశాయి. ఆగమేఘాల మీద అర్జున్ ను ఇంటికి పంపించడానికి దర్యాప్తు, న్యాయ వ్యవస్థలు ఉరుకులు పరుగులు తీశాయి. ఒక కోర్టు 14 రోజుల రిమాండ్ విధిస్తే, ఆ వెంటనే మరో కోర్టు బెయిల్ ఇచ్చేసింది. మొత్తం మీద ఆ సెలెబ్రిటీని సగౌరవంగా ఇంటికి పంపించాయి.

ఈ వ్యవహారంలో మరో గమ్మతు చోటు చేసుకుంది. ఏ ఒక్కరి ష్యూరిటీ లేకుండానే , ఒక్క పైసా జమ చేయకుండా, కేవలం రూ. 50 వేల బాండ్ పేపర్ మాత్రమే రాసి ఇవ్వడంతోనే మధ్యంతర బెయిల్ మంజూరైంది. ఇలాంటి వెసులుబాటు సామాన్యులకు అసాధ్యం అని న్యాయవాదులు అంటున్నారు. మొత్తానికి న్యాయస్థానాల్లో కూడా సెలెబ్రిటీలకు ఒక న్యాయం, సామాన్యులకు ఒక న్యాయం అని భావించే పరిస్థితి కనిపిస్తుంది.ఇంత వరకు ఒక సెలెబ్రెటీని అరెస్టు చేస్తారా, జైలుకు పంపుతారా, ఇదెక్కడి న్యాయం అని ప్రశ్నించే గొంతుకలు, సామాన్యుడి విషయంలో కూడా గొంతు కలిపితే బాగుండేది. దర్యాప్తు సంస్థలు, న్యాయ వ్యవస్థలు ఈ స్థాయిలో కాకున్నా... అంతో ఇంతో నిబద్ధతతో సామాన్యుల విషయంలో వ్యవహరిస్తే, జైళ్లలో ఇంత మంది ఏళ్లతరబడి మగ్గి ఉండే పరిస్థితి ఉండేది కాదు. కోర్టుల్లో లక్షలాది కేసులు ఉండేది కాదు. చట్టం, ధర్మం నాలుగు పాదాలపై నడుస్తు న్నాయా అన్న ప్రశ్నకు సరైన సమాధానం వచ్చుండేది.

చట్టం కొందరికి చుట్టంగా మారి, అధికారం వారికి దాసోహం చేస్తున్నంత కాలం చట్టం, ధర్మం సామాన్యుడి దరి చేరబోవనే నానుడికి, అల్లు అర్జున్ అరెస్టును ఒక ఉదంతంగానే పరిగణించవలసి ఉంటుంది. సంధ్య థియేటర్ వ్యవహారంలో అరెస్టైన వారందరి విషయంలో పోలీసులు, న్యాయ వ్యవస్థలు ఇదే విధంగా వ్యవహరించక పోవడం కూడా గమనార్హం.చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందనే ప్రచారంలో వాస్తవం వీసమెత్తైన లేదన్నది ఈ సంఘటనతో తేటతెల్లమవుతోంది.

బెయిలుకు అర్హత ఉండి కూడా, విడిపించే వారు లేక లక్షలాది మంది జైళ్లలోనే ఉండిపోతున్నారు. ఆ విధంగా జైళ్లలో మగ్గుతున్న వారికి ధనం, పరపతి, కులం, హోదా, మతం, ప్రాంతం, అధికారం ఏవీ కూడా దరి చేరడం లేదు. ఇవన్నింటిలో ఏ ఒక్కటి అండగా నిలబడలేక పోతున్నాయి. అందుకే చట్టం వారికి చుట్టం కాలేక పోతుంది.

దేశంలోని కోర్టులలో దాదాపు నాలుగున్నర కోట్ల కేసులు పెండింగ్ లో ఉన్నాయి. ఈ కేసుల్లో ఏ ఒక్క వ్యవస్థ కూడా వేగంగా నిర్దిష్టంగా తమ ధర్మాన్ని నిర్వర్తించలేక పోతున్నాయి. సామాన్యుడు కావడం, పరపతి లేక పోవడం, అండ-దండ ఆమడ దూరంలో కూడా కనిపించక పోవడంతో లక్షలాది మంది జైళ్లలో మగ్గుతున్నారు.

అల్లు అర్జున్ అరెస్టు వ్యవహారంలో పోలీసులు, న్యాయ వ్యవస్థ ఎంత వేగంగా పని చేసిందో దేశ ప్రజలంతా చూశారు. ఉదయం పదిన్నరకు ప్రారంభమైన ఈ హై డ్రామా.. రాత్రి 12 గంటలకే ముగియడం, సామాన్యులకు ఒకింత ఆశ్చరం అనిపించవచ్చు కానీ,

కథ నడిపిన వారికి అదేమంత ఆశ్చర్యం అనిపించక పోవచ్చు. గంటల వ్యవధిలోనే పోలీసు విచారణను ఎదుర్కొని జైలును చూసి, బెయిలును ముద్దాడటం పుష్ప -2 హీరోకే సాధ్యమైంది.

అల్లు అర్జున్ నిజంగానే అదృష్టవంతుడు. ఆయన ఒక సెలబ్రిటీ కావడం వల్లనే అన్ని వ్యవస్థలు కాలుకు బలపం కట్టుకొని పరుగులు తీశాయి. సామాన్యుడి విషయంలో కూడా పాలన, న్యాయ వ్యవస్థలు ఇంత కాకున్న ఇంతలో కొంతైన వేగంగా పని చేస్తే జైళ్లు కిక్కిరిసి ఉండేవి కావు.

న్యాయస్థానాల్లో లక్షల సంఖ్యలో కేసులు పెండింగ్ లో ఉండేవే కావు. సామాన్యుడికి ఒక న్యాయం, సంపన్నుడికి ఒక న్యాయం అన్నట్లుగా అల్లు అర్జున్ అరెస్టు, విడుదల అంశం తెరమీదికి వచ్చింది. న్యాయ వ్యవస్థలు, పాలకులు, కార్యనిర్వాహకులు సామాన్యుల పట్ల నిబద్ధతతో వ్యవహరించడం ద్వారానే కోర్టులలో కేసుల సంఖ్య తగ్గుతుంది. జైళ్లలో మగ్గుతున్న వారు జన జీవన స్రవంతిలో కలిసిపోయే అవకాశం ఉంటుంది.లేని పక్షంలో న్యాయం, ధర్మం సామాన్యుడికి ఆమడ దూరం అనే అపఖ్యాతి కొనసాగతం తథ్యం.



- కొలను వెంకటేశ్వర రెడ్డి
ఎస్పీ జైల్స్ (రిటైర్డ్)

## జమిలి అమల్లోకి వచ్చినా, ఎన్నికలు జరిగేది 2029లోనే

(మొదటిపేజీ తరువాయి..)
స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్ ను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి. వర్సిటీలు, కళాశాలలు, పాఠశాలలతో పాటు ప్రతిచోటా చర్చ జరగాలి. విజన్ 2020 సాకారమైన తీరు నేటి తరం తెలుసుకోవాలి. గత పరిస్థితులను బేరీజు వేస్తే విప్లవాత్మక మార్పులు అందరికి కనిపిస్తున్నాయి.

2047లోనూ ఇదే పునరావృతం అవుతుంది. స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్ ఒక రోజు పెట్టి వదిలేసేది కాదు. భవిష్యత్ తరాల బాగు కోసం చేసే ప్రయత్నంలో అందరు భాగస్వామ్యం కావాలి. రేపటి తరం భవిష్యత్తు కోసమే విజన్ 2047.

సాగునీటి సంఘాలు, సహకార, ఇతరత్రా ఎన్నికలు షెడ్యూల్ ప్రకారమే. ఈసారి కలెక్టర్ల సదస్సులో ఎన్నో మార్పులు తీసుకొస్తాం. సుదీర్ఘ సమీక్షలకు తావివ్వ కుండా ప్రశ్నలు సమాధానాల రూపంలో నిర్వహిస్తాం. ముందుగానే కలెక్టర్లు, ఎస్పీలకు చర్చ అంశాలు పంపి సమాధానాలు కోరతాం.

సమయం సద్వినియోగం, మంత్రులు అధికారుల మధ్య సమన్వయం పెరుగు తుంది. ఆస్పత్రిలో చేరిన అద్వానీ త్వరగా కోలుకో వాలని ఆకాంక్షిస్తున్నా. అద్వానీ నాకు దశాబ్దాలుగా అనుబంధం ఉంది. ఆనాడు ఏపీ అభివృద్ధిలో అద్వానీ సహకారం మరువలేనిది.

## సంక్షేమ హాస్టళ్లలో కామన్ డైయిట్ ప్లాన్‌ను ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి

- **140 మంది ప్రజాప్రతినిధులు,450 మంది సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులచే అట్టహాసంగా కామన్ డైయిట్ ప్లాన్ ప్రారంభం**
- **ఇకనుండి ప్రతినెలా 10 వ తేదీనే గ్రీన్ ఛానెల్ లో డైయిట్ చార్జీల చెల్లింపు - సి. ఎం**

హైదరాబాద్, మహానాడు:
రాష్ట్ర విద్యా రంగ చరిత్రలో నేడు అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. రాష్ట్రంలోని ఎస్.సి, ఎస్.టి. బీసీ మైనారిటీ సంక్షేమ హాస్టళ్లలో ఒకే సారి కామన్ మెనూ నేడు విజయవంతంగాఅమలు ప్రారంభమైంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా, రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం చిల్కూరులోని టీజీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ లో కామన్ డైట్ ప్లాన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనగా, ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క మధిర నియోజకవర్గం బోనకల్ లోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ప్రారంభించారు. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, గ్రంధాలయ ఛైర్మెన్లు ఇతర ప్రజాప్రతినిధులు, ఐఏఎస్, ఐపిఎస్, ఐ.ఎఫ్.ఎస్ రాష్ట్రం లోని అన్ని జిల్లాల్లో కామన్ డైయిట్ ను ప్రారంభించారు.

రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల కొరకు చదువుతోపాటు వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపిస్తూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలలో ఒకే రకమైన పౌష్టిక ఆహారం అందించే విధంగా డైట్ చార్జీలు 40% %౮% కాస్మోటిక్ చార్జీలు 200% పెంచుతూ చారిత్రక నిర్ణయం తీసుకున్నది. పెంచిన డైయిట్ చార్జీల కనుగుణంగా నేడు కామన్ డైయిట్ అమలులోకి వచ్చింది. రాష్ట్ర క్యాబినెట్ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు , కార్పొరేషన్ చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులు దాదాపు 140 ఈ కామన్ డైయిట్




ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వీరితోపాటు, 450 మంది సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు, జిల్లా కలెక్టర్లు, జిల్లా సీనియర్ అధికారులు రాష్ట్రంలోని

అన్ని గురుకులాలు మరియు సంక్షేమ హాస్టళ్లలో విద్యారులు, తల్లితండ్రుల సమక్షంలో కామన్ డైట్ ను ప్రారంభించి, విద్యార్థులతో కల్సి భోజనం చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ఇక నుండి ప్రతి నెలా 10వ తేదీనే డైయిట్ చార్జీల బిల్లులను గ్రీన్‌ఛానెల్‌లో చెల్లించను న్నట్టు ప్రకటించారు.

వికారాబాద్ పట్టణంలోని మైనారిటీ సంక్షేమ హాస్టల్లో రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కామన్ డైట్ ను ప్రారంభించారు. తిరుమలాయపాలెం మండలం మహ్మదాపురం గ్రామంలోని తెలంగాణ గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల(బాలురు) లో విద్యార్థులకు డైట్ చార్జీల పెంపు, కామన్ డైట్ మెనూ ను రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. హైదరాబాద్ షేక్ పేట సాంఘిక సంక్షేమ శాఖ పాఠశాల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ బాయ్స్ కళాశాలలో కామన్ డైట్ మెనూ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర బీ.సి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ తెలంగాణ గిరిజన సంక్షేమ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో మహిళా శిశు సంక్షేమమే, పంచాయితీ రాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ప్రారంభించారు. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణ కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో కామన్ డైట్ ప్లాన్ ను మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. గణపురం మండలం, గాంధీనగర్ లో మహాత్మ జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాలలో నూతన డైట్ కార్యక్రమాన్ని రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు లు ప్రారంభించారు. సంగారెడ్డి జిల్లా హత్నూర మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సెంచరీ జూనియర్ కళాశాల ప్రభుత్వ హాస్టల్లో విద్యార్థులకు అందించే డైట్ చార్జీల పెంపు, కామన్ డైట్ మెనూ కార్యక్రమాన్ని మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. గండుగులపల్లి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ప్రారంభించారు. హైదరాబాద్ జిల్లా మహేంద్ర హిల్స్ గర్ల్స్ సంక్షేమ హాస్టల్ లో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కామన్ డైయిట్ ను ప్రారంభించారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 15, డిసెంబర్ 2024

## డిజిటల్ మీడియాలో ..

# జయహో "మహానాడు"

# 2,85,450

## ఈ-పేపర్ పాఠకులకు సగర్వంగా సవినయంగా సెల్యూట్





మార్చి 1న ప్రారంభమైన మన
మహానాడు ప్రస్థానంలో కలిసి నడుస్తున్న,
మా అభిమాన పాఠకుల
అనుబంధానికి వందనం



సీనియర్ జర్నలిస్ట్
మార్తి సుబ్రమణ్యం
సంపాదక సారధ్యంలో





బోడెపూడి సుబ్బారావు (BSR)
సారధ్యంలో



జనం గుండె చప్పుడు

# మహానాడు

3

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 15, డిసెంబర్ 2024



# ఎన్టీఆర్‌కు భారతరత్న సాధిస్తాం

(మొదటిపేజీ తరువాయి..)

దంపతులకు 1923 , మే 25న జన్మించిన కారణ జన్ముడు ఎన్టీఆర్. నేను ఆయన్ను కలిసి మాట్లాడినప్పుడు ఎన్నో విషయాలు చెప్పేవారు. చదువుకోసం విజయవాడకు రావడం తల్లికి సాయంగా పాలు అమ్మడం, గుంటూరుకు వెళ్లి చదువుకున్న విషయాలు నాతో పంచుకునేవారు.







1945లో మద్రాసు రైలు ఎక్కాక ఎన్టీఆర్ జైత్ర యాత్ర ప్రారంభమైంది. నెలవారీ జీతం కోసమే ఆయన మొదట ఆలోచించారు. ఆ తర్వాత ఎల్వీ ప్రసాద్, నాగిరెడ్డి, చక్రపాణి గారి సహకారంతో సినీ అవకాశాలు వచ్చాయి. ఆపై ఎన్టీఆర్ సాంఘిక, పౌరాణిక, జానపద , చారిత్రక పాత్రల్లో నటించి ప్రాణం పోశారు. 300 సినిమాల్లో నటించారు. ఏడాదికి 10 నుంచి 15 సినిమాల్లో నటించారు. ఇప్పుడైతే ఒక్కో సినిమా మూడేళ్లు పడుతోంది. భారతదేశ సినీ చరిత్రలో ఎన్టీఆర్ వలె విభిన్న పాత్రలు పోషించిన నటుడు లేరు. ప్రతి పాత్రలోనూ ఆయన జీవించారు.

### రాముడైనా ..కృష్ణుడైనా ఎన్టీఆరే

ఒక రాముడు, ఒక కృష్ణుడు, ఒక వెంకటేశ్వర స్వామి అంటే మనకు గుర్తొచ్చేది ఎన్టీఆరే. ఎన్టీఆర్ రూపంలో మనం దేవుణ్ణి చూస్తున్నాము. అందరి ఇళ్లలోనూ ఆయన ఫోటోలు ఉంటాయి. వెంకటేశ్వరస్వామి, శ్రీకృష్ణుడు పాత్రలు వేసినప్పుడు ఆయన క్రమశిక్షణగా ఉండేవారు. మాంసాహారం ముట్టేవారు కాదు. ఇంట్లో నేలపై పడుకునేవారు. ఒక వైపు శ్రీరాముడు, మరోవైపు రావణుడిగా...అలాగే ఓవైపు శ్రీకృష్ణుడిగా మరోవైపు దుర్యోధనుడిగా కూడా చేశారు కదా....దీన్ని ఎలా సమర్థిస్తారు అని నేను ఎన్టీఆర్ ను అడిగాను.

ఏ పాత్ర గొప్పతనం దానిదేనని ఆయన చెప్పారు. పాత్రలో పరకాయ ప్రవేశం చేసేవారు. దానవీరశూరకర్ణలో మూడు పాత్రల్లో నటించి ఆ సినిమాకు దర్శకత్వం వహించారు. నిర్మాతగా, ఎగ్జిబ్యూటర్ గా వ్యహరించారు. ఆల్ ఇన్ వన్ అని నిరూపించుకున్నారు. సినిమాలో 24 ఫ్రేమ్స్ చూపించిన ఏకైక వ్యక్తి ఎన్టీఆర్. నేను చిన్నతనంలో లవకుశ చూశాను. ఆ సినిమా కోసం ఎడ్లబండ్లు కట్టుకుని వచ్చి చూసేవారు.



పోతులూరి వీరబ్రహ్మంగారి చరిత్ర , శ్రీనాథ కవి సార్వభౌమ వంటి సినిమాల కోసం ఆయన ఎంతో రీసెర్చ్ చేశారు. తోడుదొంగలు సినిమాకు రాష్ట్రపతి అవార్డు వచ్చింది.

### స్వర్ణాంధ్ర-విజన్ 2047

ఎన్టీఆర్ స్ఫూర్తితో స్వర్ణాంధ్ర -విజన్ 2047 ఆవిష్కరించాము. హెల్దీ ,వెల్దీ, , హ్యాపీ నే మన నినాదం. 10 సూత్రాలు రూపొందించాం. పేదరికం లేని సమాజం సాధిస్తాము. ఇవాళ నేను మెగా కృష్ణారెడ్డి కట్టించిన డోకిపర్రులోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి వెళ్లాను. మీ మండలంలో 14 ,821 వేలకు పైగా ఇళ్లు ఉన్నాయి. 51,571మంది జనాభా ఉన్నారు. ఇక్కడ జీరో పావర్టీ బాధ్యత మీరు తీసుకోవాలనని కృష్ణారెడ్డి కి చెప్పాను. ప్రతి కుటుంబం ఆనందంగా ఉండాలి. సంపద ఒక్కరికే పరిమితం కాకూడదు. కొందరు పేదరికంలో ఉంటే కొందరు సంపదతో తులతూగుతున్నారు. ఆర్థిక సంస్కరణల ద్వారా పబ్లిక్ ప్రైవేటు పార్టనర్ షిప్ వచ్చింది. కంపెనీలకు యూజర్ చార్జీలు కడుతున్నారు. పేదలకు అందరం చేయూతనివ్వాలి. ధనవంతులు కిందివారికి ఆసరా ఇవ్వాలి.

సమాజం మనకు గౌరవం ఇచ్చింది. తిరిగి సమాజానికి ఇవ్వాల్సిన బాధ్యత మనపై ఉంది. ప్రజలు, ప్రభుత్వం, ప్రైవేటు భాగస్వామ్యంతో పేదరికాన్ని తరిమేయాలి. ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి. రాళ్లు, రప్పలు ఉన్న హైదరాబాద్ ను సింగపూర్, న్యూయార్క్ గా మార్చానని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.

### 2047 నాటికి ప్రపంచంలోనే నెంబర్ వన్ గా భారత్

2047 నాటికి భారతీయులు ప్రపంచంలో ఎక్కడున్న నెంబర్ వన్ గా ఉంటారు. ఆయా దేశాల్లో పరపతి ఉందంటే మనవాళ్లకే సాధ్యం. భారతీయుల్లో అగ్రస్థానంలో తెలుగుజాతి ఉంటుంది. ప్రధాని నరేంద్రమోదీ దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యసాధన కోసం మనందరం పనిచేయాలి. మన తలసరి ఆదాయం 3,200 డాలర్లు ఉంది. అదే అమెరికాలో మన తెలుగువాడు రూ. లక్షా 20 వేల డాలర్లు సంపాదిస్తున్నాడు. అదే అమెరికన్ ఆదాయం కేవలం రూ. 60 వేల డాలర్లే .

ఇక్కడితో పోల్చితే వారు 40 రెట్లు ఎక్కువ ఉన్నారు. రాబోయే 14 ఏళ్లలో 42 వేల డాలర్లుగా మన తలసరి ఆదాయం ఉండాలని నా కోరిక. ఎన్టీఆర్ స్ఫూర్తితో పేదరిక నిర్మూలనతో పాటు ఆర్థిక అసమానతలు కూడా తగ్గించే బాధ్యత నేను తీసుకుంటాను. నిరంతరం కష్టపడే తత్వం, త్యాగనిరతి ఎన్టీఆర్ ది. 60 ఏళ్ల తర్వాత రాజకీయాల్లో వచ్చి రాక్షసుడిలా కష్టపడ్డారు. తెలుగు జాతి కోసం త్యాగం చేశాడు.

ఎన్టీఆర్ కు భారతరత్న ఇవ్వడం దేశాన్ని గౌరవించడమే. ఆయనకు భారతరత్న సాధించితీరుతాం. ఎన్టీఆర్ బాటలో







పయనిద్దాం. ప్రపంచంలోనే తెలుగుజాతిని నెంబర్ వన్ గా చేసే బాధ్యత నాది. భారతదేశ అభివృద్ధిలో మన తెలుగుజాతి భాగస్వామి కావాలి. స్వర్ణాంధ్ర మన కల. ఎన్టీఆర్ వారసులం అని గర్వంగా చెప్పుకునే రోజు దగ్గరలోనే ఉంది. ఈ కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించిన టీడీ జనార్ధన్, బృందాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.’ అని సీఎం చంద్రబాబు అన్నారు.

## సినిమాల్లోనే కాదు...రాజకీయాల్లోనూ నిజమైన హీరో

సినిమాల్లోనే కాదు రాజకీయాల్లో నిజమైన హీరో ఎన్టీఆర్. 60 ఏళ్లు కుటుంబం కోసం బతికాను. ప్రజలు నన్నుఆదరించారు. నా ఈ శేష జీవితం తెలుగు ప్రజలకు అంకితం చేయాలని చెప్పి ఆచరణలో చూపించారు. 9 నెలలు ఇల్లు, కుటుంబాన్ని వదిలేసి ప్రజల్లో తిరిగారు. ఎన్టీఆర్ పెట్టిన తెలుగుదేశం పార్టీ తెలుగుజాతి ఉన్నంత వరకూ చిరస్థాయిగా ఉంటుంది. ఆన్‌లైన్‌లో 73 లక్షలమంది పార్టీ సభ్యత్వాలు తీసుకున్నారంటే అదీ టీడీపీ సామర్థ్యం.

తెలుగుజాతి ఆత్మగౌరవం, పౌరుషం అంటే గుర్తొచ్చేది ఎన్టీఆరే. మహిళలకు మొదటిసారి ఆస్తిహక్కు ఇచ్చింది ఎన్టీఆరే. తల్లిదండ్రుల నుంచి ఆస్తి న్యాయపరంగా రాకుంటే న్యాయపోరాటం చేసే హక్కు ఆడపిల్లలకు ఉంది. ఎన్టీఆర్ రాజకీయాల్లోకి రాకముందు సంక్షేమం లేదు. ప్రభుత్వం అంటే పెత్తందారీగా ఉండేది. కూడు,గూడు, గుడ్డ నినాదం అమలు చేశారు. రాజకీయాల్లో మహిళలకు రిజర్వేషన్లకు నాంది పలికింది ఎన్టీఆర్. మండల వ్యవస్థ తీసుకొచ్చి పాలనా వికేంద్రీకరణ శ్రీకారం చుట్టారు. స్థానిక సంస్థల్లో ప్రత్యక్ష ఎన్నికలకు శ్రీకారం చుట్టారు.

కేజీ రూ.2 బియ్యం ఆయన తెచ్చిందే. ఆగస్టు సంక్షోభంలో ఆనాడు ఎన్టీఆర్ ను దించేస్తే వెంకయ్య నాయుడు సహా ఎందరో 30 రోజులు రోడ్లపైకి వచ్చి ఎన్టీఆర్ ను ముఖ్యమంత్రిని చేసేందుకు కృషి చేశారు. ఆనాడు ఎన్నో పార్టీలను వెంకయ్యనాయుడు కూడగట్టారు. మా అందరి కంటే వెంకయ్యనాయుడు గారిని ఎన్టీఆర్ అభిమానించేవారు. జాతీయభావాలతో ప్రాంతీయ పార్టీలను నడిపిన ఏకైక వ్యక్తి ఎన్టీఆర్.

రాయలసీమలో కరువు వచ్చినా దివిసీమలో విపత్తు వచ్చిన అగ్రనటుడు అయ్యుండీ జోలి పట్టాడు. సమాజమే దేవాలయం-ప్రజలే దేవుళ్లు అని చెప్పిన వ్యక్తి ఎన్టీఆర్ . నాకు ఇజాలు తెలీదు...హ్యూమనిజమే నా సిద్ధాంతం అని చెప్పిన వ్యక్తి ఎన్టీఆర్. ఇప్పుడు అన్ని ఇజాలూ పోయాయి. మెరుగైన జీవన ప్రమాణాలు కావాలి. పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పనిచేస్తున్నాము. అమెరికాలో తెలుగును ఒక అధికార భాషగా ప్రకటించారంటే అదీ మన సత్తా.





# ఈయన మనిషా.. ప్రజా తపస్వినా?

నాయుడి ముందు ఖాళీ ప్లేట్.. ఏదో సూప్ ఇచ్చారు. ఆయన ఏదీ వడ్డించుకోలేదు. అందరూ ఏదో కొంత వడ్డించుకొన్నారు. రాత్రీ పగలు ప్రపంచం అంతా సెర్చ్ చేసే గూగుల్‌ను, వైజాగును సెర్చ్ చేసి ఎంచుకొనేలా చేసిన తన కొడుకు లోకేశ్ అమెరికా పర్యటన శ్రమతో వచ్చిన గూగుల్‌తో పొద్దున అందరికంటే ముందు లేచి వెళ్లి ఒప్పందం చేసుకొని ఆ శుభవార్తతో.. 6 నెలల్లో మళ్లీ రెండో సారి సమావేశం అయిన కలెక్టర్లతో ఆ సంతోషాన్ని పంచుకొన్నారు. ఓ అరగంట ఆలస్యంగా వచ్చినందుకు వివరణ ఇచ్చుకొన్నారు.

దాదాపుగా 11 నుండి మొదలైన సమావేశంలో మధ్యాహ్నం దాటిన తరువాత భోజనం కోసం అందరికీ ముప్పావు గంట బ్రేక్ ఇచ్చారు. వచ్చి రాత్రి ఎనిమిది దాటుతున్నా ఏ మాత్రం అలసట లేకుండా దిశా నిర్దేశం చేస్తూనే వున్నారు.

పొద్దున వచ్చిన చంద్రం లెక్కనే సాయంత్రం కూడా ఆయన ఒక్కరే కనిపించారు. తన ప్రక్కన మంత్రుల పరిస్థితి, ముందున్న వారి పరిస్థితి చూసి జాలి పడి ఈరోజు అజెండాలో అంశాలు మిగిలి వున్నా.. పొద్దున 9కే వచ్చేయండి అని చెప్పి ముగించారు.

కానీ మళ్లీ అక్కడే తాను భోజనం చేసేది ఏమీ లేకున్నా.. పొద్దున నుండి అక్కడే వున్నా.. ఆ అలసట అనేది లేకుండా మళ్లీ అధికారులతో కలిసి అక్కడ కూర్చొని మాట్లాడుతూ వున్నారు.

సగటు మనిషికి అసాధ్యం. పొద్దున నుండి మధ్యాహ్నం లోపు గాని, మధ్యాహ్న భోజనాంతరం రాత్రి వరకు లేవకుండా మాట్లాడిన ప్రతి ఒక్కరి మాటలనూ గంటల పాటు చెవులతో రిక్కించి వింటూ.. అక్కడికక్కడక్కడే సందేహాలను తీర్చుతూ.. ప్రశ్నలను అడుగుతూ.. చురకలు వేస్తూ.. నవ్విస్తూ.. గంటలు గంటలుగా ఓ మనిషికి అలా సాధ్యమా అని ఆశ్చర్యపోయేలా.. ఆయన పనిచేస్తుంటే.. ఎంతో మంది వెళుతూ వస్తూ కనిపించారు.

కాళ్లు నొక్కుకొంటూ చాలామంది కనిపించారు. పొద్దున ఎలా కూర్చొన్నారో అలా.. అదే ఉత్సాహంతో.. ఆ వయసులో అలా కూర్చోవడం సాధ్యమా? అంత ఏకాగ్రతతో రోజంతా మనసు లంగ్నం చేసి ఓ మనిషి పనిచెయ్యడం సాధ్యమా అంటే.. ఒక ఉదాహరణగా లైవ్లో కనిపిస్తూ అందరినీ తెల్లబోయేలా చేశారు.

ఈయన మనిషా.. ప్రజా తపస్వా అనే ప్రశ్నలు కలగడం సహజం. గతంలో ఇలాంటి సమీక్ష 11 నుండి 1 గంటవరకు జగన్ నిర్వహించాడు.. తరువాత జూం మీటింగులే అని మనకు తెలుసు. అవి కూడా ప్రత్యక్ష ప్రసారం చెయ్యకుండా మూకీ టాకీలో సాక్షి చూపేది.

ఒక విధ్వంసం నుండి ఒక విజన్ వైపు యంత్రాంగాన్ని నడుపుతూ.. ఎటువంటి ఆంక్షలు లేకుడా ప్రత్యక్ష ప్రసారం ద్వారా పారదరదర్శకంగా చూపిస్తూ.. జనం ఏమనుకొంటున్నారో కూడా దాచకుండా చెబుతూ.. ప్రతి సమస్య మీదా అక్కడికక్కడే పరిష్కారం చూపుతూ ఆయనకు పరిపాలన మీద పట్టును తెలియజేస్తుంటే ప్రత్యక్షంగా చూసిన ప్రతి ఒక్కరూ.. ఎంత అదృష్టవంతులం నాలుగు దశాబ్దాలుగా ప్రజాసేవా తపస్సు చేస్తున్న ఒక ప్రజా మహర్షి 2047లో ఇలా వుండాలి అని కంటున్న కలలకు, దాని కోసం ఉచ్చరిస్తున ప్రతి మంత్రోపదేశాన్ని వినడం మన జన్మ అదృష్టం, పూర్వ జన్మ సుకృతం.

దేశ అత్యున్నత సివిల్స్ చదివి, ర్యాంకులు తెచ్చుకొని అయ్యేఎస్, ఐపీఎస్‌ల ఆలోచనలకు రెక్కలు తొడుగుతూ.. ముస్సోరిలో పాఠాల చెప్పే గురువు ఫ్రీ హ్యాండ్ ఇస్తూ ఉత్సాహపరుస్తుంటే.. గత ఐదేళ్ల మౌనాన్ని బద్దలు కొడుతూ.. నోరు విప్పి జనం కోసం ఆలోచనలు పంచుకొంటూ.. గురువు వద్ద సందేహాలు నివృత్తి చేసుకొంటుంటే అబ్బురంగా చూసింది ఆంధ్రా.

విధ్వంసం నుండి విజన్ వైపు పయనం మొదలెట్టి.. పట్టాల మీద లక్ష్యం వైపు వేగంగా ప్రయాణం చేస్తున్న మన ఆంధ్రా అద్భుతాలు సృష్టిస్తుంది. అభివృద్ధి చెందిన రాష్ట్రాల సరసన ఈ ఋషి నిలుపుతారు.

- చాకిరేవు

జనం గుండె చప్పుడు
# మహానాడు
4
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 15, డిసెంబర్ 2024




# తెలంగాణ తల్లి మన తల్లుల ప్రతిరూపం

- బహుజనుల తెలంగాణ తల్లిని తెచ్చుకున్నాం
- కులగణనలో తెలంగాణ దేశానికే ఆదర్శం
- దొడ్డి కొమురయ్య కురుమ భవన్ ప్రారంభోత్సవ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మహానాడు:

నమ్మకానికి మారుపేరు, మృదుస్వభావులు కురుమ సోదరులు. అలాంటి సామాజిక వర్గం నుంచి వచ్చిన పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య. సాయుధ రైతాంగ పోరాటాన్ని ముందుండి నడిపిన గొప్ప పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య. ఆయన పేరుతో దొడ్డి కొమురయ్య భవన్ ను ప్రారంభించుకోవడం సంతోషం.

కురుమ సోదరులు చదువుకునేందుకు కావాల్సిన అన్ని




సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుంది. ప్రభుత్వ హాస్టల్స్ లో డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచేందుకు గత ప్రభుత్వానికి మనసు రాలేదు. కానీ డైట్ చార్జీలు పెంచి నాణ్యమైన విద్య అందించేందుకు మన ప్రభుత్వం కృషి చేస్తోంది.

రైతు రుణమాఫీ, ఉచిత విద్యుత్.. ఇలా అన్ని సంక్షేమ పథకాల్లో బలహీనవర్గాలకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోంది. కంచె ఐలయ్య చెప్పినట్లు జమీందార్ల తెలంగాణ తల్లి కాదు.. బహుజనుల తెలంగాణ తల్లిని మనం తెచ్చుకున్నాం. ఆ తెలంగాణ తల్లి మన తల్లుల ప్రతిరూపం. బిడ్డలు అభివృద్ధి పథం వైపు నడవాలనే ఆశీర్వదించే తల్లిని మనం ప్రతిష్టించుకున్నాం.

కులగణనలో తెలంగాణ దేశానికే ఆదర్శం. కులగణన 98 శాతం పూర్తయింది... ఇంకా కేవలం 2 శాతం మాత్రమే మిగిలి ఉంది. కులగణన మెగా హెల్త్ చెకప్ లాంటిది. కులగణన పూర్తయితే కురుమలకు జనాభా ప్రాతిపదికన దక్కాల్సిన వాటా దక్కుతుంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ కురుమ సోదరులకు రెండు, యాదవ సోదరులకు రెండు ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చింది. మీరు కలిసికట్టుగా గెలిపంచుకున్నప్పుడే రాజకీయ పార్టీలు మళ్లీ టికెట్లు ఇస్తాయి.

ముఖ్యమంత్రిగా విప్ లే నా కళ్లు, చెవులు. ప్రజా ప్రభుత్వంలో నాలుగు సామాజిక వర్గాలకు విప్ లుగా అవకాశం కల్పించాం. బీర్ల ఐలయ్య విప్ గా ఉన్నాడు కాబట్టే మీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నడు. వచ్చిన అవకాశం వదులుకోవద్దు. మీ బిడ్డలను మీరు గెలిపించుకుంటేనే మీకు ప్రాధాన్యత ఉంటుంది. వేర్వేరు పార్టీల్లో ఉన్నా కొన్ని సందర్భాల్లో మీ సామాజిక వర్గాలను గెలిపించుకోవాలి. అప్పుడే ఈ సమాజంలో మీకు మనుగడ ఉంటుంది.

ఈ ప్రభుత్వం మీది. మీ సమస్యలు పతిష్కరించే బాధ్యత నాది. భవిష్యత్ లో రాజకీయంగా, ఆర్థికంగా మీ కోటా మీకు వచ్చేలా చూసే బాధ్యత మాది. కంచె ఐలయ్య సూచనను పరిశీలిస్తాం. దొడ్డి కొమురయ్య పేరు శాశ్వతంగా గుర్తుండిపోయే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

# అప్రజాస్వామికంగా సాగునీటి సంఘాల ఎన్నికలు

- నో డ్యూస్ ఇవ్వకుండా ప్రభుత్వం దారుణ కుతంత్రం
- వీఆర్ఓలు అందరినీ మండల ఆఫీస్‌కు తరలించారు
- ఇది చేతకాని దద్దమ్మ ప్రభుత్వం
- దిక్కుమాలిన రాజకీయాలతో గెలుపు ఒక గెలుపేనా?
- ఇంత కంటే సిగ్గుచేటు మరొకటి ఉంటుందా?
- కడప ఎంపీ వైయస్ అవినాష్‌రెడ్డి ధ్వజం



కడప,మహానాడు:

సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల్లో గెలుపుపై ఏ మాత్రం నమ్మకం లేకపోవడం వల్లనే కూటమి ప్రభుత్వం కుట్రలు, కుతంత్రాలు చేసిందని కడప ఎంపీ వైయస్ అవినాష్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా ప్రభుత్వం వ్యవహరించడంతో, తాము ఎన్నికలను బహిష్కరించామని ఆయన వెల్లడించారు. అలా ఈ ఎన్నికల్లో గెల్చి, అదేదో తమ గొప్ప విజయం అన్నట్లుగా పులివెందుల మాజీ ఎమ్మెల్సీ చెప్పుకుంటున్నారని ఆక్షేపించారు.

జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికల సినిమాకు స్క్రీన్‌ప్లే, ప్రొడ్యూసర్, డైరెక్టర్.. చివరకు ప్రేక్షకుడు, ఆ సినిమాపై రివ్యూ కూడా ఇచ్చేది మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవి. సాగునీటి సంఘాల ఎన్నికలు ఎంత ప్రజాస్వామ్య విరుద్ధంగా జరిగాయన్నది.. గడచిన రెండు, మూడు రోజులుగా ఈ ఎన్నికల ప్రహసనం ఎలా కొనసాగిందో మీరంతా చూశారు.

నీటిపారుదల శాఖ ఈ సంఘాల ఎన్నికలు నిర్వహిస్తుంది. ఎవరైనా రైతులు ఈ ఎన్నికల్లో టీసీ (ప్రాదేశిక నియోజకవర్గం) సభ్యుడిగా పోటీ చేయాలనుకుంటే, నీటి బకాయిలు పూర్తిగా చెల్లించి ఉండాలి. ఆ మేరకు వీఆర్‌ఓ నుంచి నో డ్యూస్ సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ) తీసుకోవాలి. ఇది తప్పనిసరి. అది ఉంటేనే నామినేషన్ అనుమతిస్తారు. లేకపోతే రిజెక్ట్ చేస్తారు. అది టీడీపీ ప్రభుత్వం పెట్టిన నిబంధన.

ఈ ఎన్నికలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, వీఆర్‌ఓలు అంతా గ్రామ సచివాలయాల్లో ఉండాలి. కానీ చాలా మంది వీఆర్‌ఓలు ఫోన్లు స్విచాఫ్ చేసి కూర్చున్నారు. ఇంకా అందరు వీఆర్‌ఓలను మండల ఆఫీస్‌కు తీసుకుపోయి, నిర్బంధం చేశారు. బయట పోలీసులను కాపలగా పెట్టారు. వారిని అక్కడ జైల్లో ఖైదీలుగా ఉంచినట్లు ఉంచారు. ఏ రైతు కూడా తమ వీఆర్‌ఓను కలిసే వీలు లేకుండా చేశారు. అలా వీఆర్‌ఓలు ఆ సర్టిఫికెట్లు ఇవ్వకుండా కుట్ర చేశారు.

ఇది చేతకాని దద్దమ్మ ప్రభుత్వం. పోలీసులను అడ్డు పెట్టుకుని ఎన్నికలు చేయడం చేతకానితనం. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు జరిగి ఉంటే, రైతులు ఓటు వేసి ఉంటే, టీడీపీ పులివెందుల ఇన్‌ఛార్జ్‌ను చొక్కా విప్పి కూర్చోబెట్టి ఉండేవారు. మా పార్టీ సానుభూతిపరులు పోటీ చేస్తే, ఓడిపోతామని చెప్పి, రైతులకు నోడ్యూస్ సర్టిఫికెట్స్ ఇవ్వలేదు.

దీన్ని ఎన్నికల నిర్వహణ అంటారా? మీరు చేసిన ఈ తతంగం ప్రజాస్వామబద్ధమా వీఆర్‌ఓలు గ్రామ సచివాలయాల్లో ఉండకుండా, వారిని ఎందుకు మండల ఆఫీస్‌ల్లో బంధించి ఉంచారు. చివరకు కవరేజ్‌కు వచ్చిన మీడియాపైనా దాడి చేశారు. ఇన్ని పనులు చేసి, నో డ్యూస్ సర్టిఫికెట్ కోసం ఎవరూ రాలేదని పచ్చి అబద్ధాలు చెప్పారు.

మీ ఆఫీస్‌లో కూర్చుని మాట్లాడడం కాదు. మీకు నిజంగా ధైర్యం ఉండి ఉంటే, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించి ఉండాల్సింది. కానీ, ఆ పని చేయకుండా, మా పార్టీ సానుభూతిపరులు పోటీ చేయకుండా, వారికి ఎన్‌ఓసీలు ఇవ్వకుండా కుట్ర చేశారు. అసలు మీరు ఏ పని చేశారని రైతులు మీకు ఓటేస్తారు?

మీ ప్రభుత్వం వచ్చి 6 నెలలైంది. పెట్టుబడి సాయంగా రూ.20 వేలు ఇస్తామని చెప్పి, ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. రైతులకు ఉచిత పంటల బీమా లేదు. పంటలు, ధాన్యం సేకరణ లేదు. కనీస మద్దతు ధర లేదు. మీ ప్రభుత్వం వస్తే ఈ–క్రాప్ విధానం తీసేస్తామన్నారు. ఈరోజు అదే విధానాన్ని అమలు చేస్తున్నారు. మీ ప్రభుత్వం అని విధాలుగా ఫెయిల్. అందుకే ఓటమి భయంతో రైతుల పోటీ చేయకుండా అడ్డుకున్నారు.

1978 నుంచి ఉన్న రాజకీయాలను కూకటివేళ్లతో పెకిలించావా? సిగ్గు లేకుండా మాట్లాడుతున్నావు. నీ ముఖం ఒకసారి అద్దంలో చూసుకో. ఈ ఎన్నికలు ఎలా చేశారనేది ఇక్కడ ప్రతి ఒక్కరూ గమనించారు. ఒక్క పులివెందులలోనే కాదు, జమ్మలమడుగులో కూడా అదే పని చేశారు. వీఆర్‌ఓలు అందరినీ తీసుకెళ్లి, దేవగుడిలో బంధించారు. ఇది వాస్తవం కాదా? కేవలం ఓడిపోతామనే భయంతోనే కదా అవన్నీ చేసింది. నో డ్యూస్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా, రైతులు పోటీ చేయకుండా చేయడం సిగ్గు చేటు కాదా? రెవెన్యూ, పోలీసు అధికారులను అడ్డం పెట్టుకుని రాజకీయం చేయడం కాదు. అందుకే ఇకనైనా ప్రజాస్వామ్యబద్ధంగా రాజకీయాలు చేయడం నేర్చుకోవాలని ఎంపీ అవినాష్‌రెడ్డి హితవు చెప్పారు.

# పేదల వైద్య సేవలకు సహకారం

- మాజీ డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ శాసనసభ్యులు పద్మారావు గౌడ్

సికింద్రాబాద్,మహానాడు:

నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలను పొందేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నామని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. సితాఫలమండీలోని ఎం.ఎల్.ఏ. క్యాంపు కార్యాలయంలో సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన 52 మంది లబ్దిదారులకు దాదాపు రూ.27 లక్షల విలువజేసే ముఖ్యమంత్రి సహాయ నిధి (సీ.ఎం.ఆర్.ఎఫ్) చెక్కులను శనివారం పద్మారావు గౌడ్ అందించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు మంచి వైద్యం ఖరీదైన వ్యవహారంగా మారిన ప్రస్తుత రోజుల్లో వివిధ మార్గాల్లో వారిని ఆదుకుంటున్నామని, ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేస్తున్నామని తెలిపారు. కార్పొరేటర్లు కంది శైలజ, రాసురి సునీత రమేష్, లింగాని



ప్రసన్న లక్ష్మి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్య మంత్రి సహాయ నిధి తో పాటు ప్రభుత్వ పదకలకై ప్రజలు అత్యవసర సందర్భాల్లో సితాఫలమండీ లోని తమ కార్యాలయాన్ని సంప్రదించాలని, ఎవరికీ లంచాలు చెల్లించాల్సిన అవసరం లేదని పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.





# గీత వృత్తిని మరింత ప్రోత్సహిస్తాం

- ఏ పీ గౌడ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి

విజయవాడ,మహానాడు:

గౌడ కుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన అందరికీ అందిస్తామని ఏపీ గౌడ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి తెలిపారు.. బెంజిసర్కిల్ లో ఉన్న కృష్ణా జిల్లా లారీ ఓనర్స్ అసోషియేషన్ హాల్ లో ఏపీ గౌడ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గా వీరంకి వెంకట గురుమూర్తి శనివారం ప్రమాణ స్వీకారం చేశారు.

ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. బీసీ కులాల చేతి వృత్తులకు పునర్ వైభవం తీసుకువస్తామని గతంలో ఎన్నడూ



లేనివిధంగా గీత వృత్తిని మరింత ప్రోత్సహిస్తామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన గౌడ్ కుల కార్పొరేషన్ చైర్మన్ పదవి ద్వారా రాష్ట్రంలోని బీసీలకు సేవ చేసే అదృష్టంగా భావిస్తానన్నారు. కూటమి ప్రభుత్వం బీసీలకు ఒక్క ఏడాదిలోనే రూ. 39,000 కోట్ల బడ్జెట్ కేటాయించారన్నారు.

గౌడకులాలు ఆర్థికంగా బలోపేతం అయ్యేవిధంగా కేరళలో ఉన్న నీరా ఉప ఉత్పత్తులను అక్కడ ఏవిధంగా ప్రోత్స హిస్తున్నారో ఏపీలో కూడా ఉప ఉత్పత్తులను ప్రోత్సహిస్తా మన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమైన ప్రతి ఇంట్లో పారిశ్రామికవేత్తలను తయారు చేసినట్లే గౌడ కులాల్లో కూడా పరిశ్రమలు పెట్టుకునేలా ప్రోత్సాహం అందిస్తామన్నారు.

గృహ నిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ తాను నమ్ముకున్న వారికి పార్టీ, ప్రభుత్వం అండగా ఉంటూ వారి పక్షాన నిలబడుతుందన్నారు.

ఈ పదవి రావడం ఆయన చిత్తశుద్ధికి నిదర్శనం అని అన్నారు. నాకు 25 సంవత్సరాలుగా గురుమూర్తి వ్యక్తి గతంగా తెలుసునన్నారు. బీసీలకు అండగా ముఖ్యమంత్రి అనేక పథకాలను అందిస్తున్నారన్నారు. గత ప్రభుత్వం గౌడ కార్పొరేషన్ కు నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేసారన్నారు.

రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ.. గత 5 ఏళ్లలో ఎన్నోపోరాటాలు చేశారని దాని ఫలితమే ఈ పదవి అని కొనియాడారు. బీసీ కులాలందరికీ అందుబాటులో ఉంటూ వారి ఐక్యత కోసం ఎన్నో పోరాటాలు చేశారన్నారు. స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు బడుగు వర్గాల కోసం పాటుపడితే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వారిని ఆర్థికంగా తోడ్పాటు అందిస్తున్నారన్నారు. రాష్ట్రాభివృద్ధికి విజన్ డాక్యుమెంట్ తెచ్చిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు.

ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ నేడు ఎంతో మంది బీసీలు ప్రముఖ స్థానంలో ఉండటానికి కారకులు స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు అని తెలిపారు. చైర్మన్ గా గురుమూర్తికి సముచిత స్థానం లభించిందన్నారు. గతంలో బీసీ సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించారన్నారు. బీసీ ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రాల్లో బీసీ కులగణన చేసుకునే విధంగా రాష్ట్రాలకు స్వేచ్ఛ నిచ్చారన్నారు.

ప్రమాణ స్వీకార కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు దువ్వారపు రామారావు, అంగర రామ్మోహన్, శాసనసభ్యులు వర్ల కుమార రాజా, గద్దె రామ్మోహన్, వెనిగండ్ల రాము, నక్కా ఆనంద బాబు, బోడే ప్రసాద్, గౌతు శిరీష, కాగిత కృష్ణ ప్రసాద్, తంగిరాల సౌమ్య, నిమ్మకాయల చినరాజప్ప, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు కొనకళ్ల నారాయణ, కొమ్మారెడ్డి పట్టాభిరామ్, రావి వెంకటేశ్వరరావు, లంక దినకర్.. మాజీ పార్లమెంట్ సభ్యులు వడ్డే శోభనాద్రీశ్వరరావు, మాజీ శాసనమండలి సభ్యులు టి.డి. జనార్ధన్, స్వర్గీయ ముఖ్య మంత్రి ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ, నాయ కులు నాగుల్ మీరా, గొట్టిపాటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. తొలుగ ఏపీ గౌడ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా వీరంకి వెంకట గురుమూర్తి చేత సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. తనూజ రాణి ప్రమాణ స్వీకారం చేయించారు.



జనం గుండె చప్పుడు
# మహానాడు
5
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 15, డిసెంబర్ 2024

# చేయని తప్పుకు జైల్లో వేశారు

- చట్టాన్ని గౌరవిస్తాను
- రేవతి కుటుంబానికి అండగా ఉంటా
- నాకు అండగా నిలిచిన వారందరికీ ధన్యవాదాలు
- మీడియాతో అల్లు అర్జున్

**హైదరాబాద్,మహానాడు:** చంచల్ గూడా జైలు నుంచి విడుదలైన అల్లు అర్జున్ మీడియాతో మాట్లాడుతూ ఎమోషనల్ అయ్యాడు. 'జరిగిన సంఘటన దురదృష్టకరం. ఇది అనుకోకుండా జరిగింది. నేను చట్టాన్ని



గౌరవిస్తాను. రేవతి కుటుంబానికి నా సానుభూతి. నాకు అండగా నిలిచిన వారందరికీ ధన్యవాదాలు' అంటూ చెప్పుకొచ్చారు. తనకు సపోర్ట్ చేసిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు చెప్తున్నానని, తాను బాగున్నానని, ఎవరు ఆందోళన చెందొద్దు అని చెప్పారు. చట్టం పట్ల నాకు గౌరవం ఉందని అల్లు అర్జున్ అన్నారు.

తొక్కిసలాటలో చనిపోయిన రేవతి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలుపుతున్నానని, జరిగిన ఘటన దురదృష్టకరమని, గత 20 ఏళ్లుగా తాను సంధ్య థియేటర్‌కు వెళ్తున్నానని, ఏం చేసినా జరిగిన నష్టాన్ని పూడ్చలేమని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టం ఎలా చెప్తే తాను అలా చేస్తా అంటూ చెప్పుకొచ్చాడు. ఇక చంచల్ గూడా జైలు నుంచి విడుదలై ఇంటికి చేరుకోగానే.. బన్నీని చూసి భార్య స్నేహారెడ్డి, పిల్లలు భావోద్వేగానికి గురయ్యారు. స్నేహారెడ్డి భర్తను పట్టుకొని కన్నీళ్లు పెట్టుకుంది.

### చేయని తప్పుకు జైలుకు వెళ్లా..

ఇక జైలు నుంచి విడుదలైన బన్ని నేరుగా గీతా ఆర్ట్స్ కార్యాలయానికి వెళ్లాడు. అయితే ఇంటికి డైరెక్ట్‌గా వెళ్లకుండా కార్యాలయానికి వెళ్లడంపై చర్చ మొదలైంది. గీతా ఆర్ట్స్ కార్యాలయంలోనే అల్లు అరవింద్, బన్నీ వాసు, సన్నిహితులుండగా.. నిన్న బెయిల్ వచ్చినా ఇవాళ రిలీజ్ అవ్వడంపై వారితో బన్నీ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. చేయని తప్పుకు జైలుకు వెళ్లానంటూ సన్నిహితుల వద్ద బన్నీ ఎమోషనల్ అయ్యారని, రాత్రి అంతా జైలులో నిద్రపోకుండానే ఉన్నట్లు తెలుస్తోంది. అంతేకాదు ఈ కేసులో ఇకపై ఎలాంటి స్టెప్స్ తీసుకోవాలనేదానిపై చర్చ నడుస్తున్నట్లు సమాచారం.

### న్యాయవాదితో చర్చలు

జైలు నుంచి విడుదలైన తర్వాత అల్లు అర్జున్ తన న్యాయవాదితో చాలా సేపు భేటీ అయ్యారు. జైలు అధికారులపై కోర్టు ధిక్కరణ కేసు వేయాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో ఎంత దూరమైనా వెళ్లాలని లీగల్ టీమ్ కు చెప్పినట్లు సమాచారం. తండ్రి అల్లు అరవింద్‌కు కూడా ఇదే నిర్ణయం చెప్పిన బన్నీ.. ఇప్పటికే జైలుకు వెళ్లి వచ్చాను.. మళ్లీ వెళ్తా అంటూ బన్నీ ఎమోషనల్ అయ్యారని టాక్. ఇప్పటికే తన సన్నిహితులతో అల్లు అర్జున్ మంతనాలు జరిపారని, జైలుకు వెళ్లడాన్ని సవాల్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది.

అనంతరం 'పుష్ప' దర్శకుడు, నిర్మాతతో అల్లు అర్జున్ సమావేశమయ్యాడు. తాజా పరిణామాలపై చర్చించారు. అంతకు ముందే న్యాయవాదుల బృందంతో చర్చలు జరిపిన అల్లు అర్జున్.. పలు మధ్యంతర బెయిల్పైనా చర్చించారు. ఈ సందర్భంగా అల్లు అరవింద్ మాట్లాడుతూ మీడియాకు కృతజ్ఞతలు చెబుతున్నానన్నారు. దేశవ్యాప్తంగా అల్లు అర్జున్‌కు మద్దతు లభించిందని, పుష్ప సినిమాకు చక్కటి మద్దతు ఉందన్నారు.

కాగా, ఇంటికి వెళ్లిన తర్వాత అల్లు అర్జున్‌ను చిరంజీవి సతీమణి సురేఖ పరామర్శించారు. అ తర్వాత రానా, హరీశ్ శంకర్, టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఆర్.నారాయణ మూర్తి, నాగచైతన్య తదితరులు పరామర్శించారు.

ఆ తర్వాత సినీ దర్శకుడు కొరటాల శివ, నిర్మాత దిల్ రాజు, వంశీ పైడిపల్లి, విజయ్ దేవరకొండ, ఆనంద్ దేవరకొండ కూడా పరామర్శించారు.

# ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన బొర్రా గోపీమూర్తి

**అమరావతి, మహానాడు:** ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించిన బొర్రా గోపీమూర్తి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ మేరకు వెలగపూడిలోని రాష్ట్ర అసెంబ్లీ భవన ప్రాంగణంలో శనివారం జరిగిన కార్యక్రమంలో శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు ఆయనతో ప్రమాణం చేయించారు. అనంతరం బొర్రా గోపీమూర్తికి మండలి ఛైర్మన్ శుభాకాంక్షలు తెలిపి, శాసన మండలికి సంబంధించిన నియమ, నిబంధనలు, కార్యకలాపాల పత్రాలను అందజేశారు.

కార్యక్రమంలో ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) ఎమ్మెల్సీలు కె.ఎస్. లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్, ఉపాధ్యాయులు, నూతన ఎమ్మెల్సీ కుటుంబ సభ్యులు, అసెంబ్లీ సిబ్బంది,



తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల విద్యార్థుల ఆరోగ్యం దెబ్బ తినడానికి కారణం
# గత బిఆర్ఎస్ పాలకులు

- పది ఏండ్లుగా డైట్ చార్జీలు పెంచకుండ, మెస్ బిల్లులు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన గత సర్కార్
- గురుకుల విద్యార్థుల సంక్షేమం విస్మరించి ఇప్పుడు భోజనం బాగాలేదనడానికి బీఆర్ఎస్ నాయకులకు సిగ్గుండాలి
- కొత్త మెనూ ప్రకారమే ఆహారం అందించాలి.. నాణ్యత లోపిస్తే ఉపేక్షించం కఠిన చర్యలు ఉంటాయి.
- బోనకల్ మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో కామన్ డైట్ మెనూ ను ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- విద్యార్థులతో ముచ్చటిస్తూ భోజనం చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**బోనకల్,మహానాడు:** గత పది సంవత్సరాలు అధికారంలో ఉండి గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ హాస్టల్స్ విద్యార్థుల వసతులు పట్టించుకోకుండా, డైట్ చార్జీలు పెంచకుండా, పెండింగ్లో ఉన్న బిల్లులు నెలలు తరబడి చెల్లించకుండా గత బిఆర్ఎస్ పాలకులు చేసిన నిర్లక్ష్యం వల్లనే విద్యార్థుల ఆరోగ్యాలు దెబ్బ తిన్నాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు.

గత పది సంవత్సరాలుగా గురుకుల, హాస్టల్ విద్యార్థుల సంక్షేమం గురించి పట్టించుకోని గత బిఆర్ఎస్ పాలకులు ఇప్పుడు హాస్టల్స్ బాగాలేవని, భోజనం సరిగా లేదని మాట్లాడటానికి సిగ్గుండాలని విమర్శించారు. శనివారం మధిర నియోజకవర్గం బోనకల్ మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న డైట్ మెనూ ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు.

గత బిఆర్ఎస్ పాలకులు గురుకుల, హాస్టల్ విద్యార్థులకు సంబంధించిన మెస్ బిల్లులను చెల్లించకుండా తీవ్ర నిర్లక్ష్యం చేసిన ఫలితంగా విద్యార్థులకు నాణ్యతగా అందాల్సిన ఆహారం అందలేదన్నారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమైన కాంట్రాక్టర్లు ఆహార పదార్థాలను నాసిరకంగా సరఫరా చేయడం వల్ల వాటిని తిన్న విద్యార్థుల ఆరోగ్యాలు



దెబ్బతిన్నాయని , ఆ విషయాలను మర్చిపోయి సోయి తప్పిన బిఆర్ఎస్ నాయకులు 40 శాతం డైట్ చార్జీలు పెంచిన ప్రజా ప్రభుత్వం పై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

విద్యా బుద్ధులతో పాటు మానసికంగా, దేహదారుర్యంగా ఎదిగినప్పుడే విద్యార్థులు మేదస్సును పెంచుకొని ప్రపంచంతో పోటీపడతారని భావించి 40 శాతం డైట్ చార్జీలు, 200% కాస్మోటిక్ చార్జీలను పెంచామన్నారు. విద్యార్థులకే కాకుండా ఆసుపత్రిలో ఉన్న రోగులకు కూడా డైట్ చార్జీలను పెంచామని వెల్లడించారు.

### ప్రతి బిడ్డకు విద్యనందిస్తాం

తెలంగాణలో ప్రతి బిడ్డ చదువుకోవాల్సిందేనని, ప్రతి బిడ్డకు మంచి వసతితో కూడిన విద్యను అందించాలన్నది ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని వివరించారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణానికి అనుగుణంగా డైట్ చార్జీలు పెరగకపోవడం వల్ల విద్యార్థులకు పౌష్టికాహారం అందించలేక ఉపాధ్యాయులు చాలా కష్టాలు పడ్డారని, వీటిని గమనించిన ప్రజా ప్రభుత్వం కమిటీ వేసి పెరిగిన ధరలకు అనుగుణంగా 15 రోజులలో నివేదిక తప్పించుకొని 40 శాతం డైట్ చార్జీలు పెంచామని తెలిపారు.

డైట్ చార్జీలను 3 నుంచి 7వ తరగతి విద్యార్థులకు 950 నుంచి1330 రూపాయలకు, 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు 1100 నుంచి 1540 రూపాయలకు, ఇంటర్ నుంచి పీజీ విద్యార్థులకు 1500 నుంచి 2100 రూపాయలకు ప్రజా ప్రభుత్వం పెంచిందని, అదేవిధంగా కాస్మోటిక్ చార్జీలను బాలికలకు 7వ తరగతి వరకు 55 నుంచి 175 రూపాయల వరకు, 11 సంవత్సరాల వయస్సు పై గల బాలికలకు 75 నుంచి 275 రూపాయలకు, బాలురు 7వ తరగతి వరకు 62 నుంచి 150 రూపాయల వరకు, 11 సంవత్సరాల వయస్సు పై గల బాలురు 62 నుంచి 200 రూపాయలకు పెంచినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు.

# చంద్రబాబు మళ్ళీ అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారు

- ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి

**విజయవాడ, మహానాడు:** విజన్ – 2047 పేరుతో చంద్రబాబు మళ్ళీ అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ దశ – దిశ మారాలంటే తక్షణం కావాల్సింది విజన్లు కాదు.. విభజన హామీలు. రాష్ట్రాన్ని నెంబర్ 1 గా నిలపాలంటే నెరవేరాల్సింది కేంద్రం ఇచ్చిన హామీలని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి అన్నారు. మీడియాతో ఇంకా ఆమె ఏమన్నారంటే... దశాబ్ద కాలంగా విభజన హామీలను గాలికి వదిలేశారు. పూర్తిగా అటకెక్కించారు. రాష్ట్ర విభజన సమయంలో అనాడు యూపీఏ సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హెూదా హామీ ఇచ్చింది. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హెూదా ఇచ్చింది. నూతన రాజధానికి పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం ఇవ్వాలని సూచించింది. బుందేల్ ఖండ్ తరహాలో వెనుక బడిన జిల్లాలకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ప్రకటన చేసింది.

మౌలిక సదుపాయాల కల్పన, పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని షెడ్యూల్ 13 లో పొందపరించింది. కడప స్టీల్, దుగ్గరాజుపట్నం పోర్టులను నిర్మిస్తామని విభజన చట్టంలో పొందపరించింది. నూతన రైల్వే జోన్, పెట్రోలియం యూనివర్సిటీ, విశాఖ – చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, విజయవాడ, విశాఖలో మెట్రో రైల్, హైదరాబాద్ నుంచి విజయవాడకు ర్యాపిడ్ రైల్, ఇలా ఎన్నో హామీలు నేటికీ కలగానే మిగిలాయి. ఇవ్వాల్టికి ఒక్క హామీకి దిక్కులేకుండా పోయింది. గడిచిన 10 ఏళ్లలో ప్రత్యేక హెూదా వచ్చి ఉంటే పన్నుల్లో రాయితీలు ఉండేవి. వేల సంఖ్యలో కొత్త పరిశ్రమలు వచ్చేవి. లక్షల్లో ఉపాధి అవకాశాలు లభించేవి.



పోలవరం ప్రాజెక్టు పూర్తి అయ్యి ఉంటే రాష్ట్రం సస్యశ్యామలం అయ్యేది. విజయవాడ, విశాఖలో మెట్రో రైల్ నిర్మాణం జరిగితే ప్రధాన నగరాలుగా అభివృద్ధి చెందేవి. వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీలు అంది వుంటే పేదరిక నిర్మూలన సాధ్యం అయ్యేది. విభజన హామీలు అమలయ్యి ఉంటే రాష్ట్రం దిశ – దశ పూర్తిగా మారేది. దేశంలో నెంబర్ 1 రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ విరాజిల్లేది. విభజన చట్ట హామీలు బుట్టదాఖలు చేయడంలో ప్రధాన ముద్దాయి ప్రధాని నరేంద్ర మోడీ అయితే, రెండో ముద్దాయి చంద్రబాబు.. మూడో ముద్దాయి జగన్ మోహన్ రెడ్డి. ముగ్గురు కలిసి రాష్ట్రానికి తీరని ద్రోహం చేశారు. హెూదా 5 ఏళ్లు కాదు 10 ఏళ్లు ఇస్తామని మోడీ నమ్మబలికితే.. హెూదా ఏమైనా సంజీవనా అని చంద్రబాబు చెవుల్లో పూలు పెట్టారు.

25 మంది ఎంపీలు ఇస్తే ఎందుకు ఇవ్వరో చూస్తా అని శపథాలు చేసిన జగన్ రాష్ట్ర ప్రజలకు తీరని అన్యాయం చేశారు. చంద్రబాబుని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. ఎప్పటికైనా రాష్ట్ర అభివృద్ధికి సంజీవని ప్రత్యేక హెూదా మాత్రమే. హెూదాతోనే రాష్ట్రానికి విజన్. మోడీ పిలక మీ చేతుల్లో ఉంది. విభజన హామీలపై ప్రధానిని నిలదీయండి. కేంద్రం గల్లా పట్టి రాష్ట్ర హక్కులను సాధించండి.

# సుప్రీంకోర్టులో తీర్పు దానంతట అదే రాలేదు

- మాదిగ సామాజిక వర్గానికి అందరికంటే ఎక్కువ అవకాశాలు
- గ్లోబల్ మాదిగ డే-2024 కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,మహానాడు:** ఎన్నికల్లో రాహుల్ గాంధీ గారు ఒక స్పష్టమైన ప్రకటన చేశారు. మాదిగలకు సంబంధించి అనుకూల నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ లో కాంగ్రెస్ పార్టీ విధానం స్పష్టంగా తెలియజేసాం. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సుప్రీం కోర్టులో పెండింగ్ లో ఉన్న మాదిగ ఉపకులాల రిజర్వేషన్ల కేసులో, బలమైన వాదనలు వినిపించేలా దామోదర రాజనర్సింహ నేతృత్వంలో న్యాయవాదులను నియమించాం.

సుప్రీంకోర్టులో తీర్పు దానంతట అదే రాలేదు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో క్రియాశీల పాత్ర పోషించింది. సుప్రీంకోర్టు తీర్పును తూచా తప్పకుండా అమలు చేస్తుందని శాసనసభ వేదికగా మేం స్పష్టంగా ప్రకటించాం. తెలంగాణ సమస్యలా ఈ సమస్య జఠిలం అయింది. కానీ ప్రజల ఆకాంక్ష మేరకు ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.






మీ వాదనలో బలం ఉంది.. మీకు న్యాయం చేయాలన్న ఆలోచన మా ప్రభుత్వానికి ఉంది. న్యాయపరమైన చిక్కులు రాకుండా అమలు చేసేలా అధ్యయనం చేసేందుకు ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో మంత్రి వర్గ ఉపసంఘం వేసాం. 60 రోజుల్లో నివేదిక ఇవ్వాలని జ్యుడీషియల్ కమిషన్ ను కూడా నియమించాం. మరో వారం రోజుల్లో నివేదిక ఇచ్చే అవకాశం ఉంది.

సీఎం పేషీలో మాదిగలు ఉండాలని డా.సంగీత ని నియమించుకున్నాం. వందేళ్ల ఉస్మానియా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వీసీగా ఒక మాదిగ సామాజిక వర్గం వ్యక్తిని నియమించాం. IIT వీసీగా, విద్యా కమిషన్ మెంబర్ గా, ఉన్నత



విద్యా శాఖలో మాదిగ సామాజిక వర్గానికి అవకాశం కల్పించాం.పగిడిపాటి దేవయ్య ని స్కిల్ యూనివర్సిటీ బోర్డు డైరెక్టర్ గా నియమించుకున్నాం.

అడగకముందే మాదిగ సామాజిక వర్గానికి అందరికంటే ఎక్కువ అవకాశాలు కల్పిస్తున్నాం. ఈ ప్రభుత్వం మీకు అన్యాయం జరగనివ్వదు. న్యాయం చేసేందుకు అన్ని విధాలా కృషి చేస్తాం. అమలు చేయడంలో కొంత ఆలస్యం కావచ్చు. కానీ మీకు తప్పక న్యాయం చేస్తాం. నా రాజకీయ ప్రస్థానంలో మాదిగ సామాజిక వర్గం పాత్ర ఎంతో ఉంది. ఈ ప్రభుత్వంలో మీకు న్యాయం చేసే బాధ్యత నాది.

6

జనం గుండె చప్పుడు

మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 15, డిసెంబర్ 2024


## భవిష్యత్ దృష్ట్యా...హైవేలతో
# రాజధాని రోడ్ల అనుసంధానం!

- సీడ్ కేపిటల్ నుంచి నేరుగా హైవేలకు అనుసంధానం చేసేలా రోడ్ల డిజైన్లు
- ప్రయివేట్ ఆస్తులకు ఎక్కువగా నష్టం జరగకుండా జాగ్రత్తలు
- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ



**అమరావతి, మహానాడు:** రాజధాని అమరావతిని జాతీయ రహదారులతో అనుసంధానం చేసేలా రోడ్లను రూపకల్పన చేస్తున్నట్టు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ వెల్లడించారు. రాబోయే 30 ఏళ్లను దృష్టిలో పెట్టుకుని సీడ్ కేపిటల్ నుంచి నేరుగా హైవేలకు వచ్చేలా రోడ్లను డిజైన్ చేస్తున్నామన్నారు. ప్రజలెవరికీ ఇబ్బంది కలగకుండా రోడ్ల నిర్మాణం చేస్తామన్నారు. అయితే రోడ్ల డిజైన్ లో భాగంగా ఇళ్లు నష్టపోతున్న వారు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. రాజధానిలోని పలు రోడ్ల నిర్మాణాలకు సంబంధించిన మార్గాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారాయన. సుమారు నాలుగు గంటల పాటు పలు గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేసారు.

సీడ్ కేపిటల్‌లో ఇప్పటికే డిజైన్లు రూపొందించిన E 11, E13 రోడ్లను పొడిగించి 16వ నెంబర్ జాతీయ రహదారికి అనుసంధానం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించిన డిజైన్ల రూపకల్పన ను లీ అసోసియేట్స్ సంస్థకు అప్పగించారు. ఈ సంస్థ ఇచ్చిన డిజైన్లతో క్షేత్ర స్థాయి పరిస్థితిని పరిశీలించేందుకు మంగళగిరి, నవులూరు, ఎర్రబాలెం గ్రామాల్లో పర్యటించి రోడ్లు వెళ్లే మార్గాలను పరిశీలించారు. వీటితో పాటు రాజధాని మీదుగా వెళ్తున్న విజయవాడ వెస్ట్ బైపాస్ పనులను కూడా మంత్రి పరిశీలించి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారులకు పలు సూచనలు చేశారు. ఆ తర్వాత మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు.

### ప్రయివేట్ ఆస్తులకు పెద్దగా నష్టం లేకుండా రోడ్ల డిజైన్లు

అమరావతి కేపిటల్ సిటీ నుంచి చెన్నై – కోల్‌కతా 16వ నెంబర్ జాతీయరహదారికి అనుసంధానం చేసేందుకు E 11, E13 రోడ్లను పొడిగిస్తున్నారు. రాబోయే 30 ఏళ్లను దృష్టిలో పెట్టుకొని రాజధానిలో రోడ్ల నిర్మాణం చేస్తున్నాం. దానికి తగినట్లుగా సీడ్ కేపిటల్ నుంచి E11, E13 రోడ్లను జాతీయ రహదారికి కలిపేలా డిజైన్లు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఇంకా, ఆయన ఏమన్నారంటే.. రాజధాని కోసం 58 రోజుల్లో 34 వేల ఎకరాల భూమి రైతులు స్వచ్ఛందంగా ఇచ్చారు. గత ప్రభుత్వం రాజధాని లేకుండా మూడు ముక్కలాట ఆడింది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి నిర్మాణానికి ఉన్న ఇబ్బందులను తొలగించుకుంటూ వచ్చాం. ఇప్పటికే 22 వేల కోట్ల విలువైన టెండర్లకు అథారిటీ ఆమోదం తెలిపింది. మరో 20 వేల కోట్లకు వచ్చే సోమవారం జరిగే సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో ఆమోదం తీసుకుంటాం. 217 చదరపు కి.మీ ల పరిధిలో ఈస్ట్ నుంచి వెస్ట్ కు 16 రోడ్లు,నార్త్ నుంచి సౌత్ కి18 రోడ్లు వస్తున్నాయి.

ఈ రోడ్లలోనే ఉన్న E 11,E13 లను పొడిగిస్తున్నామన్నారు. ప్రయివేట్ ఆస్తులకు ఎక్కువగా ఇబ్బంది లేకుండా అటవీ భూము లున్న ప్రాంతాల నుంచే ఈ రోడ్లను అనుసంధానం చేస్తున్నా మన్నారు. కొద్దిగా ఇళ్లు నష్టపోతున్న వారితో అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చించి వారికి న్యాయం చేస్తా రు. ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా రోడ్ల నిర్మాణాలు చేస్తాం.. ఈ రెండు రోడ్లపై గంటకు 80 నుంచి100 కిమీ వేగంతో వెళ్ళేలా డిజైన్ చేశారు.

### వెస్ట్ బైపాస్‌కు కేపిటల్ సిటీ రోడ్లతో కనెక్టవిటీ

విజయవాడ వెస్ట్ బైపాస్ పనులు దాదాపు తుది దశకు చేరుకున్నాయి... అమరావతి రాజధాని మీదుగా వెళ్తున్న ఈ రోడ్డులో ప్రతి కిలోమీటర్ కు కేపిటల్ రోడ్డులతో కనెక్టవిటీ ఉంటుంది... దానికి తగినట్లుగా నిర్మాణం పూర్తి చేయాలి. వెస్ట్ బైపాస్ రోడ్డు నిర్మాణంలో భాగంగా కృష్ణా నదిపై నిర్మించిన బ్రిడ్జిని మంత్రి పరిశీలించారు.

# రైతు పొట్టకొట్టిన వైసీపీ!

- జగన్ రెడ్డిపై ఎమ్మెల్యే సోమిరెడ్డి ఫైర్



**మంగళగిరి, మహానాడు:** రైతుల పేరెత్తే అర్హత, హక్కు జగన్మోహన్ రెడ్డికి ఎక్కడిది ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్నదాతలను అధోగతి పాల్జేశారు. అస్తవ్యస్త నిర్ణయాలతో రైతు ఆత్మహత్యల్లో ఏపీని జాతీయ స్థాయిలో మూడో స్థానానికి తీసుకెళ్లారు. మొదటి రెండు స్థానాల్లో కర్ణాటక, మహారాష్ట్ర నిలిస్తే జనాభా ప్రాతిపదికన తీసుకుంటే రైతు ఆత్మహత్యల్లో ఏపీదే అగ్రస్థానమని తెలుగుదేశం పార్టీ(టీడీపీ) సీనియర్ నేత, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఫైర్ అయ్యారు. ఈ మేరకు ఆయన మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కౌలురైతు ఆత్మహత్యల్లోనూ తమిళనాడు తర్వాత స్థానం ఏపీదే. జనాభా ప్రాతిపదికన తీసుకుంటే ఇక్కడ కూడా మొదట స్థానం ఆంధ్రప్రదేశ్ దేనన్నారు. ఇంకా, ఆయన ఏమన్నారంటే.. వైసీపీ ఐదేళ్ల పాలనలో జగన్మోహన్ రెడ్డి సాధించిన ఘనత ఇదే. అన్నదాతల ప్రయోజనాలతో ముడిపడిన కీలకమైన వ్యవసాయ శాఖను మూసేశారు.

ఇరిగేషన్ శాఖను చంపేశారు. జగన్మోహన్ రెడ్డి ఒక్కసారి పులివెందులకు వెళ్లి రైతులతో మాట్లాడితే ఐదేళ్లలో వ్యవసాయ రంగానికి చేసిన ద్రోహం తెలుస్తుంది. మైక్రో ఇరిగేషన్, వ్యవసాయ యాంత్రీకరణ, భూసార పరీక్షలు, సూక్ష్మ పోషకాల పంపిణీ తదితర పథకాల అమలులో రెండు ప్రభుత్వాలకు తేడా అడిగితే రైతులే చెబుతారు. వ్యవసాయ శాఖతో పాటు కీలక పథకాలను మూలనపెట్టేసిన మీరు రైతుల గురించి మాట్లాడుతారా ఇప్పుడు మా ప్రభుత్వం రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తోంది. అదే వైసీపీ ప్రభుత్వంలో రైతులకు ఐదారు నెలలు పడిగాపులు తప్పలేదు.

జాతీయ స్థాయిలో రైతుల తలసరి అప్పు రూ.74,500గా ఉంటే ఏపీలో వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.2.45 లక్షలు. నీటిపారుదల శాఖకు 2014–19 మధ్య రూ.64,800 కోట్లు ఖర్చుపెట్టాం.. పెరిగిన ధరల ప్రకారం వైసీపీ ఐదేళ్ల పాలనలో రూ.80 వేల కోట్లు ఖర్చు పెట్టాలి. కానీ రూ.30 వేలు కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారు. నిధులు తగ్గించేసి నీటి పారుదల శాఖను చంపేశారు. మా ప్రభుత్వ హయాంలో పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా గోదావరి నీటిని కృష్ణా డెల్టాకు అందించాం. తద్వారా కృష్ణా మిగులు జలాలను కరువు పీడిత రాయలసీమకు అందించాం. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇరిగేషన్ ప్రాజెక్టుల పరంగా జగన్మోహన్ రెడ్డి సాధించిన ఘనత ఏమైనా ఉందా 2017–18, 2018–19లో బిందు తుంపర్ల సేద్యంలో ఏపీని జాతీయస్థాయిలో అగ్రస్థానాన నిలిపాం.. మీరేం చేశారు

వ్యవసాయ యాంత్రీకరణలోనూ మేం చరిత్ర సృష్టించాం.. మీరు సాధించిన ఘనత ఏమైనా ఉందా అంటే..అన్నీ పథకాలను మూసేయడమే. స్వర్ణాంధ్ర సాధనకు రూపకల్పన చేసిన పది సూత్రాల్లో 4గా నీటి భద్రత, ఐదవదిగా సాగులో అధునాతన సాంకేతికత, 8వదిగా నాణ్యమైన ఉత్పత్తులుగా చేర్చారు. విజన్ 2047 ప్రణాళికలో రైతులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చాం. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఏనాడైనా రైతుల మధ్యలోకి వచ్చారా..వ్యవసాయం గురించి సమీక్ష చేశారా చివరగా జగన్మోహన్ రెడ్డి చేసిందేమంటే.. రైతులు పండించిన ధాన్యంతో రేషన్ బియ్యాన్ని అక్రమంగా విదేశాలకు స్మగ్లింగ్ చేసి ఏ2తో పాటు ఆయన బంధువులు కోట్లు సంపాదించడం.

# సీఎంఆర్ఎఫ్‌తో పేదల ప్రాణాలు కాపాడుతున్నాం

### మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



**తూర్పునాయుడు పాలెం, మహానాడు:** సీఎంఆర్ఎఫ్‌తో రాష్ట్రంలోని ఎందరో పేదల ప్రాణాలు కాపాడుతున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజ నేయస్వామి అన్నారు. కొండపి నియోజకవర్గంలో పలువురికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను శనివారం తూర్పునాయుడు పాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందని అన్నారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రికి, మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

## విడదల రజనీ, లేళ్ల అప్పిరెడ్డి దగ్గర పనిచేసే మనుషులు
# నా కూతురుని హత్య చేశారు!

- న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వెళితే మాపైనే అక్రమ కేసులు పెట్టారు
- పొలంలోకి అడుగు పెట్టనీయకుండా బెదిరిస్తున్న వైసీపీ నేతలు
- గత ప్రభుత్వం అక్రమంగా తొలగించిన పింఛన్లు పునరుద్ధరించండి
- పార్టీ కేంద్ర కార్యాలయంలో సీఎం చంద్రబాబు నాయుడుకు వివిధ ప్రాంతాల ప్రజల విన్నపాలు

**అమరావతి, మహానాడు:** మానవ మృగాలకు కొమ్ముకాసి, నేరస్తులకు రక్షణ కల్పించిన వైసీపీ దుర్మార్గ చర్యలు బయట పడుతున్నాయి. న్యాయం చేయాలని అడిగిన బాధితులపైనే గత ప్రభుత్వంలో పోలీసులు కేసులు పెట్టి వేధించిన ఘటనలు వెలుగు చూస్తున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కూతురి హత్య కేసులో న్యాయం చేయాలని ఓ మహిళ విన్నవించుకోగా... పొలంలోకి దిగితే వైసీపీ నేతలు చంపేస్తామని బెదిరిస్తున్నారని బాధితులు సమస్యను విన్నవించుకున్నారు. గత ప్రభుత్వంలో అకారణంగా తొలగించిన పింఛన్లు పునరుద్ధరించాలని పలువురు వికలాంగులు కోరారు. అనారోగ్యం, ఇతర సమస్యలతో బాధపడేవారికి సీఎం ఆర్థికసాయం చేశారు. అంతకముందు పార్టీ నేతలతో సభ్యత్వ నమోదుపై సమీక్షించారు.

### చిత్రహింసలు పెట్టి నా కూతరుని చంపేశారు

డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న తన కూతురు 2022 జూలై నాలుగోతేదీన కాలేజీకి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని, అదే కాలనీలో ఉంటున్న ఆటో డ్రైవర్ ఆనంద్ అనే యువకుడు ప్రేమపేరుతో వంచించాడని గుంటూరు జిల్లా, గుజ్జనగుళ్లకు చెందిన నిశంకర శంకరలీల అనే మహిళ సీఎం వద్ద మొరపెట్టుకున్నారు. 14 నెలల పాటు తన కూతురుని చిత్రహింసలు పెట్టి బండారు ఆనంద్, అతని సోదరులు అరవింద్, అజిత్ వారి మేనమామ తిరుపతిరావు, అత్త అంకలక్ష్మి తన కూతురుని శవంగా పంపించారని కన్నీటి పర్యంతమయ్యారు.





బాధితురాలు చెప్పిన వివరాల ప్రకారం.....‘నా కూతురి హత్యపై రెండేళ్లుగా పోరాడుతుంటే మాపైనే హత్యాయత్నం కేసులు పెట్టారు. ఆ కేసులో రెండేళ్లుగా తిరుగుతున్నాం. తాం విడదల రజనీ, లేళ్ల అప్పిరెడ్డి దగ్గర పని చేస్తామని నిందితులు బెదిరిస్తున్నారు. చేతికి అందివచ్చిన కూతుర్ని పోగొట్టుకున్నదేకాక అక్రమంగా పెట్టిన కేసులో ఇప్పటికీ





కోర్టుల చుట్టూ తిరుగుతున్నాము. న్యాయం చేయాలని నాటి నల్లపాడు సీఐని కోరగా అసభ్య పదజాలంతో దూషించారు. నా కూతురిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి’ అని బాధితురాలు వేడుకున్నారు.

శంకరలీల బాధను విన్న సీఎం ఆమెను ఓదార్చారు.




కేసులో ఎంతటివాళ్లున్నా వదిలిపెట్టమని, తప్పకుండా న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.

### పొలంలోకి అడుగుపెడితే చంపేస్తామని బెదిరిస్తున్నారు

పొలంలోకి అడుగుపెడితే చంపేస్తామని వైసీపీ నేతలు బెదిరిస్తున్నారని రాజమండ్రి రూరల్ మండలం, హుకుంపేటకు చెందిన బొప్పన సురేష్ బాబు సీఎంకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు ప్రకారం....“2021లో చాగల్లు పరిధిలోని దారవరంలో, మార్కొండపాడు, బ్రాహ్మణగూడెంలో 17 ఎకరాలు పొలం కొనుగోలు చేశాం. 7.57 రిజిస్ట్రేషన్ కాగా మిగతాది అగ్రిమెంట్ రాయించుకున్నాం. కానీ వైసీపీ నేతలు ఆ పొలంలోకి దిగనీయకుండా, అడుగుపెడితే చంపేస్తామని బెదిరిస్తున్నారు. మాజీ హెూంమంత్రి తానేటి వనిత ప్రోద్బలంతో కేసులు పెట్టి వేధించారు. నా పొలం నాకు దక్కేలా చేయండి’ అని విన్నవించారు.

### వైసీపీ ప్రభుత్వంలో ఇబ్బందులు పడ్డాం

జగన్ ప్రభుత్వంలో తాం తీవ్ర ఇబ్బందులు పడ్డామని విజయవాడ వన్ టౌన్‌కు చెందిన అక్కల రోజా, ఆమె భర్త, జవాన్ జ్ఞానానంద్ సీఎం చంద్రబాబు దగ్గర కంటతడి పెట్టుకున్నారు. బిల్డింగ్ మూడో అంతస్తుకు అనుమతి ఇవ్వకుండా ఐదేళ్ల పాటు తిప్పి ఇబ్బందులకు గురిచేశారని జవాన్ దంపతులు మొరపెట్టుకున్నారు. కృష్ణా అనే వ్యక్తి ఇళ్లు కొనుగోలు చేసి రూ.10లక్షల మేర ఇవ్వకుండా బెదిరించారని, అప్పుల పాలై రోడ్డుపాలయ్యామన్నారు. సమస్యను పరిష్కరిస్తామని వారికి సీఎం హామీ ఇచ్చారు.











2022లో జరిగిన తన కూతరి హత్యపై విచారణ చేసి న్యాయం చేయాలని సీఎం చంద్రబాబు వద్ద విలపిస్తున్న గుంటూరులోని గుజ్జనగుళ్లకు చెందిన శంకరలీల అనే మహిళ

7

జనం గుండె చప్పుడు

మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 15, డిసెంబర్ 2024


# వైసీపీ నేతలకు రైతులు ఇప్పుడు గుర్తొచ్చారా?



- ఎమ్మెల్యే చదలవాడ

**నరసరావుపేట, మహానాడు:** జగన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు రైతన్నలకు మద్దతు ధర కోసం, పంట నష్టపరిహారం కోసం తెలుగుదేశం పార్టీ(టీడీపీ) రోడ్డెక్కి నిరసనలు తెలియజేసే వరకు కనీసం క్షేత్రస్థాయి పరిశీలనకు కూడా వైసీపీ నేతలు వెళ్ళలేదని ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు విమర్శించారు.

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఆరు నెలలైనా పూర్తి కాకుండానే రైతు సోదరులకు ఏదో అన్యాయం జరుగుతుందంటూ రోడ్లెక్కడం విడ్డూరంగా ఉందన్నారు. గడచిన అయిదేళ్లలో రైతన్నలకు కనీస పంట నష్టపరిహారం చెల్లించలేదు, గిట్టుబాటు ధర కూడా ఇవ్వలేదు, అసెంబ్లీలో చంద్రబాబు నాయుడు క్రాప్ ఇన్సూరెన్స్ పై నిలదీస్తే, అప్పుడు ఆగమేఘాల మీద చెల్లించారని గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయంలో హార్టికల్చర్ ని పూర్తిగా నిర్వీర్యం అయింది.. రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో లేకుండా చేశారని తెలిపారు.

## జగన్ జన్మదినం రోజున సేవా కార్యక్రమాలు

- పార్టీ శ్రేణులకు వైయస్సార్‌సీపీ పిలుపు

**తాడేపల్లి, మహానాడు:** మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా, ఈనెల 21న, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని స్థాయిల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చిన వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం, ఆ రోజు కార్యక్రమంలో అందరూ మమేకం కావాలని కోరింది. ఎమ్మెల్యేలు, పార్టీ కో ఆర్డినేటర్లు సమన్వయం చేసుకుని.. పార్టీ నేతలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులను భాగస్వామ్యం చేస్తూ, జగన్‌గారి పుట్టినరోజు వేడుకలు అన్ని స్థాయిల్లో ఘనంగా నిర్వహించాలని నిర్దేశించింది.



ఘనంగా పీవీ సింధు ఎంగేజ్‌మెంట్.. రింగ్స్ మార్చుకున్న పీవీ సింధు, వెంకటదత్తసాయి 22న రాజస్థాన్ ఉదయ్‌పూర్‌లో సింధు పెళ్లి 24న హైదరాబాద్‌లో రిసెప్షన్.

## నిరుపేదల ఆశీస్సులే చంద్రబాబుకు శ్రీరామ రక్ష

- 4 విడతలలో 28 లక్షల 94 వేల 245 రూపాయల సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందచేశాం
- అనారోగ్య పీడితులను ఆదుకున్న సిఎం చంద్రబాబుకి కృతజ్ఞతలు
- కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



**నెల్లూరు,మహానాడు:** అధికారంలోనికి వచ్చిన ఆరు నెలల వ్యవధిలో అనారోగ్య పీడితులకు 4 సార్లు ముఖ్యమంత్రి సహాయనిధి అందచేసిన ఘనత సిఎం చంద్రబాబు నాయుడు కే దక్కుతుందన్నారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి .

నెల్లూరు నగరం మాగుంట లే అవుట్ లోని విపిఆర్ నివాసంలో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి చేతుల మీదుగా బుచ్చిరెడ్డి పాళెం పట్టణానికి చెందిన చంద్రగిరి దేవరాజు 66 వేల 6 వందల 51 రూపాయలు, ఇందుకూరు పేట గ్రామానికి చెందిన కాకాని నీరజ 35 వేలు కోవూరు గ్రామానికి చెందిన పాకం సుజాత 85 వేల 44 రూపాయలు కొడవలూరు గ్రామ వాసి మారంరెడ్డి కౌసల్యమ్మ 2 లక్షల 2 వేల 483 రూపాయల మొత్తం 3 లక్షల 88 వేల 578 రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గ పరిధిలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఇప్పటి వరకు 28 లక్షల 94 వేల 245 రూపాయల చెక్కులు పంపిణీ చేసినట్లు వివరించారు. సిఎంఆర్ ఎఫ్ చెక్కులు అందుకున్న అనారోగ్య పీడితులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో విడవలూరు టిడిపి ఇంచార్జి అడపాల శ్రీధర్ రెడ్డి, యువ నాయకులు బెజవాడ వంశీ రెడ్డి, బుచ్చిరెడ్డి పాళెం టిడిపి ఇంచార్జి అడపాల అనీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




ఉరవకొండ మండల కేంద్రంలోని ఎస్.కె జూనియర్ కాలేజ్ లో జాబ్ మేళాలో ఎంపికైన నిరుద్యోగ యువతీయువకులకు నియామక పత్రాలను అందజేసిన రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్.

హైదరాబాదులో జరిగిన సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ పోటీలలో జగ్గయ్యపేట 22 వార్డు కౌన్సిలర్ గొట్టే నాగరాజు కుమారుడు సురేష్ 93 కేజీల విభాగంలో ఎక్విప్డ్ ప్రథమ స్థానం గోల్డ్ మెడల్ ను, అన్ ఎక్విప్డ్ లో తృతీయ స్థానంలో బ్రౌన్జ్ మెడల్ ను సాధించాడు. ఈ సందర్భంగా శనివారం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్యని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాతయ్య సురేష్ ను అభినందించి మరిన్ని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని అన్నారు.



## జన జాతరను తలపించిన మెగా జాబ్‌మేళా

- రెట్టింపు సంఖ్యలో కంపెనీ ప్రతినిధులు హాజరు
- యువత భవిష్యత్తుకు అండగా ఉంటా..
- ఎమ్మెల్యే అమిలినేని శపథం




**కల్యాణదుర్గం, మహానాడు:** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో కల్యాణదుర్గం ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు మంచి భవిష్యత్ ఇవ్వాలనే లక్ష్యంతోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు 200కు పైగా కంపెనీలతో చర్చించి ఈ మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నాం.. యువత ఎలాంటి అపోహలు పెట్టుకోకుండా మంచి కంపెనీలలో వచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకుని వారి భవిష్యత్తు తీర్చిదిద్దుకోవాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు.

కల్యాణ దుర్గం జ్ఞానభారతి పాఠశాలలో రెండో రోజు మెగా జాబ్ మేళా నిర్వహించారు. జాబ్ మేళాకు వచ్చిన యువత ఉద్యోగ అవకాశాలు సద్వినియోగం చేసుకుని మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని, ఇక్కడితోనే ఆగకుండా యువతకు పూర్తి స్థాయిలో ఉద్యోగ ఉపాధి కల్పించే వరకు జాబ్ మేళాలు నిర్వహించి వారికీ అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

## టీచర్లకు ఓరియంటేషన్ ప్రొగ్రాం

**విస్సన్నపేట, మహానాడు:** స్థానిక వికాస్ కాలేజీలో ప్రైవేటు స్కూల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు శనివారం ఓరియంటేషన్ క్లాసెస్




నిర్వహించారు. ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, ఉమ్మడి కృష్ణ జిల్లా ఎంఎల్సీ అభ్యర్థి ఆలపాటి రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు ఎలా బోధించాలో ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే కొలికపూడి వివరించారు.



వాగ్దేవి డిగ్రీ కాలేజీలో కబడ్డీ జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక జరిగింది. నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, యాజమాన్యం రాయల శ్రీనివాసరావు, రాజేంద్ర ప్రసాద్, ఓఎన్ఆర్ ప్రారంభించారు.

## బీజేపీ సంస్థాగత ఎన్నికలు

- 11 బూత్‌లకు అధ్యక్షుల ఎన్నిక, ఘన సత్కారం

**గుంటూరు, మహానాడు:** గుంటూరు పశ్చిమ అసెంబ్లీ ఒకటవ మండలంలో బూత్ అధ్యక్షుడు కోలవెన్ను శ్రీనివాసరావు నివాసంలో భారతీయ జనతా పార్టీ(బీజేపీ) సంసాగతంగా పోలింగ్ బూత్ అధ్యక్షుల ఎన్నిక రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈదర శ్రీనివాసరెడ్డి నిర్వహణలో కోలాహలంగా జరిగింది. 11 బూతులకు పోలింగ్ అధ్యక్షులు ఎన్నిక అయ్యారు. వారికి రిటర్నింగ్ అధికారి తాడువాయి రామకృష్ణ, మండల ఎన్నికల సహా రిటర్నింగ్ అధికారి ముత్యం




నరేంద్ర నియామక పత్రాలు అందచేశారు. ముఖ్య అతిథిగా మాజీ మంత్రి శనక్కాయల అరుణ చేతుల మీదుగా ఘన సత్కారం జరిగింది.

విశిష్ట అతిథిగా జిల్లా సభ్యత్వ ప్రముఖ్ పాలపాటి రవి, రాష్ట్ర హెడ్ క్వార్టర్స్ ఇంచార్జ్ మకుటం శివ, అతిథులుగా పార్టీ రాష్ట్ర పదాధికారి కొక్కెర శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర సీనియర్ నాయకులు జంధ్యాల రామలింగేశ్వర శాస్త్రి పాల్గొని సంస్థాగత అంశాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కీలక పర్యవేక్షకులుగా రాష్ట్ర మీడియా కో కన్వీనర్ వెలగలేటి గంగాధర్, సీనియర్ నాయకులు ఈమని మాధవరెడ్డి, సీనియర్ నాయకులు కడియాల శివాజీ వ్యవహరించారు. మండల సహా ప్రముఖ కాశీనాథ్, జిల్లా ధార్మిక సెల్ కన్వీనర్ ప్రతాప ప్రసాద్, ఆరో మండల అధ్యక్షుడు లంకా రవిశంకర్, మధు తదితరులు పాల్గొన్నారు.



బిజెపి సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ జీని మర్యాద పూర్వకంగా కలిసిన రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య. అనంతరం బిజెపి సీనియర్ నేత పాకా వెంకట సత్యనారాయణ తదితరులుతో భేటీ అయిన దృశ్యం



కృష్ణా జిల్లాలో సాగునీటి వినియోగదారులు సంఘాల కు ఎన్నికైన బిజెపి నేతలు తో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురు పాటి కుమార స్వామి, మచిలీపట్నం అర్బన్ అధారిటీ చైర్మన్ మట్టా ప్రసాద్ తదితరులు



జగ్గయ్యపేట మున్సిపల్ వాకింగ్ ట్రాక్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య



తన పెళ్ళికి రావాలి అంటూ కుటుంబ సభ్యులతో పాటు వచ్చి జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ఆహ్వానించిన ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు




నందిగామ పట్టణం పాత బైపాస్ గ్యాస్ కంపెనీ రోడ్డు మరియు మాగల్లు గ్రామం నందు జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకలలో శుక్రవారం నాడు రాత్రి సంఘస్తులు, క్రైస్తవ సోదర సోదరీమణులు, దైవ సేవకులు మరియు కూటమి నేతలతో కలిసి పాల్గొన్న ఏపీ ప్రభుత్వ విప్ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య



సత్తెనపల్లిలోని లయోలా ఇంజనీరింగ్ కాలేజ్ లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అండర్ -19 బేస్ బాల్ పోటీలను ప్రారంభించిన పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ | ఆదివారం 15, డిసెంబర్ 2024

# రేవంత్‌కి తెలంగాణ ఆత్మ లేదు

- **సోనియాజీ..మీ సమ్మతితోనే బతుకమ్మను అవమానిస్తున్నారా**
- **ఉద్యమకారులపై తుపాకి ఎక్కిపెట్టిన వ్యక్తి రేవంత్ రెడ్డి**
- **తెలంగాణ జాగృతి రౌండ్ టేబుల్ సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**
- **రేవంత్ రెడ్డి రూపొందించిన విగ్రహానికి కాంగ్రెస్ మాతగా నామకరణం చేస్తూ తీర్మానం**




**హైదరాబాద్:** మహిళలు జరుపుకునే బతుకమ్మను ముఖ్యమంత్రి అవమానించిన విషయం తెలిసిందా లేదా లేదంటే మీ సమ్మితితోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ సమాజాన్ని అవమానిస్తున్నారా అన్నది తెలంగాణ సమాజానికి చెప్పాలని సోనియా గాంధీని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ప్రియాంకా గాంధీ కేరళ నుంచి లోక్ సభకు ఎన్నిక య్యారు కాబట్టి అక్కడి చీరకట్టుకొని పార్లమెంటులో మాట్లా డారని, మరి తెలంగాణ సీఎం బతుకమ్మను అవమానం చేస్తూ తెలంగాణ తల్లి చేతుల్లోని బతుకమ్మను మాయం చేశారని, దీనికి మద్ధతిస్తున్నారా అని ప్రియాంకా గాంధీని ప్రశ్నించారు.సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వచ్చి గ్యారెంటీ కార్డులపై సంతకాలు చేసి తెలంగాణ ప్రజలను గౌరవిస్తామని చెబితే ప్రజలు నమ్మి కాంగ్రెస్ కు ఓట్లు చేశారని అన్నారు.

బీసీ వర్గాలకు చెందిన మహేశ్ కుమార్ గౌడ్ పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నా, కూడా బహుజనులను కించపరిచే విధంగా మాట్లాడిన ఎమ్మెల్యేపై కాంగ్రెస్ పార్టీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నడూ జై తెలంగాణ అని అనని వ్యక్తి తెలంగాణకు ముఖ్యమంత్రి కావడం మన దురదృష్టమని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ఆత్మ లేదని, ఆయన ఉద్యమంలో లేరు కాబట్టి తెలంగాణ హృదయం అర్థమవ్వడం లేదని చెప్పారు.

తెలంగాణ తల్లిపై ప్రేమ లేదు కాబట్టి సీఎం రేవంత్ రెడ్డి రూపం మార్చారు. తెలంగాణ ఉద్యమంలో, తెలంగాణ పునర్నిర్మాణంపై రేవంత్ రెడ్డి ఎక్కడా లేరు. తెలంగాణ పునర్నిర్మాణ సమయంలో రేవంత్ రెడ్డి కేసీఆర్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర చేశారు. ఉద్యమకాలంలో ఉద్యమకారులపై తుపాకి ఎక్కిపెట్టిన వ్యక్తి రేవంత్ రెడ్డి. తెలంగాణ తల్లి చేతిలో ఉన్న బతుకమ్మను చూస్తే తెలంగాణ సమాజాన్ని చూసినట్లుం టుంది. అందరం కలిస్తేనే ఒక అందమైన బతుకమ్మ అవు తుంది... అందరం కలిస్తేనే అందమైన సమాజం అవుతుందన్న సందేశం ఇచ్చేది బతుకమ్మ. అలాంటి బతుకమ్మ తెలంగాణ తల్లి చేతిలో లేకపోతే తెలంగాణ సమాజంలో స్నేహశీలత, సుహృద్భావం ఎలా కనిపిస్తుంది మన అస్తిత్వాన్ని దెబ్బతీసే ధైర్యం ఎవరికీ లేదు.

# రాజమండ్రిలో పుష్ప 3

- **పోలీసులపై నకిలీ నోట్ల గ్యాంగ్ దాడి**
- **దర్జాగా భీమవరం డాన్ ను తీసుకువెళ్లిన ముఠా**

**భీమవరం:** పోలీసులతో నకిలీనోట్ల గ్యాంగ్ తలపడింది. ఛేజింగ్.. ఫైటింగ్ సీన్లతో మరో పుష్ప 3 సినిమాను తలపించింది. బరితెగించిన ఈ ముఠా ఏకంగా నకిలీ నోట్ల డాన్ ను విడిపించుకుపోయింది. ఈ ఘటన తీవ్ర సంచలనం రేపింది. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. శ్రీకాకుళం జిల్లా రణస్థలం నుంచి రాజాం వైపు బైకు వైపు వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను జీ సిగడం పోలీసులు పెద్ద పెనశం గ్రామంలో తనిఖీ చేయగా రూ. 15లక్షల నకిలీ నోట్లు దొరికాయి. ఇక పోలీసుల విచారణలో అసలు గుట్టు వెలుగు చూసింది. ఒడిషా సరిహద్దులోని మెలియపుట్టి మండలం పట్టుపురం గ్రామంలో నకిలీనోట్ల ప్రింటింగ్ వ్యవహారం వెలుగుచూసింది. వెంటనే పోలీసులు దాడి చేసి రూ. 57లక్షల నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. నకిలీ నోట్ల ముద్రిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకోగా.. ఈ నకిలీ నోట్ల డాన్ రాజమండ్రిలో ఉన్నట్టు సమాచారం లభించింది. వెంటనే శ్రీకాకుళం పోలీసులు రాజమండ్రి చేరుకున్నారు. నకిలీనోట్ల డాన్ ను భీమవరంలో అదుపులోకి తీసుకున్నారు.

అనంతరం అతడిని భద్రత మధ్య శ్రీకాకుళం తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇంతలో పోలీస్ వాహనాన్ని రెండు కార్లు.. నాలుగు ద్విచక్ర వాహనాలతో దొంగ నోట్ల ముఠా వెంబడించింది. రాజమండ్రి సమీపంలోని వీఎల్ పురం వద్ద పోలీసులపై అటాక్ చేసింది. పోలీసు వాహనంలోని డాన్ ను విడిపించుకుని ఈ ముఠా దర్జాగా వెళ్లిపోయింది. ఈ ఘటనపై పోలీసుల్లో అలజడి మొదలైంది.

# అల్లు అర్జున్ అరెస్ట్‌లో "రాజ్య"ధర్మం



అల్లు అర్జున్ అరెస్ట్ – రిమాండ్ పరిణామాల్లో "రాజ్య ధర్మం" కనబడుతున్నది. ఈ పరిణామాల వల్ల ప్రభుత్వ అధికారం, దాన్ని ప్రభావితం చెయ్యగల రాజకీయ నిర్ణయాలకు మించిన "రాజ్యం" ఒకటి వున్నదన్న సోషల్ పాఠం మళ్ళీ గుర్తుకొస్తోంది.

రాజ్యం అంటే ఒక భౌగోళిక, సామాజిక, రాజకీయ, అధికారిక వ్యవస్థలు కలగలిసిన ఏకైక శక్తి. ఇది ఒక భావన దీనికి స్పష్టమైన రూపం లేదు. అన్ని వ్యవస్థలూ సమతూకంతో పని చేసినపుడు "రాజ్యం" ఉనికి, పరిపూర్ణత ప్రజల అనుభవంలోకి వస్తుంది.

ప్రజల జీవన హక్కు, స్వేచ్ఛ, సమానత్వం వంటి మౌలిక హక్కులను కాపాడటం. రక్షణ, న్యాయం అందించడంలో తటస్థంగా వ్యవహరించడం. ప్రజల ఆరోగ్యం, విద్య, వృద్ధి వంటి రంగాల్లో సేవలు అందించడం. సామాజిక న్యాయం కల్పించడం. పరిపాలన పారదర్శకంగా, ప్రభుత్వ నిర్ణయాలు ప్రజలకు స్పష్టంగా ఉండటం. అవినీతి రహిత పాలన. శాంతి భద్రతలు అంతర్గతం శాంతిని కాపాడటం సమానత్వం మరియు సామరస్యం అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు కల్పించడం వర్గీయ వివక్ష లేకుండా సమన్వయాన్ని పెంపొందించడం.మొదలైనవన్నీ "రాజ్య" ధర్మాలు.

అల్లు అర్జున్ తో సహా సినిమా రంగం జీవనశైలి–ప్రజల జీవనశైలికి భిన్నంగా వుంటుంది. ఆడంబరం, వైభవం, అపారమైన డబ్బు ఖర్చు, ఒక విధమైన లెక్కలేనితనం, వంటి సెలబ్రిటీ జీవనశైలి ప్రజలపై నానారకాల ప్రభావాలూ చూపిస్తుంది. ఈ ప్రభావం ఇది మానవ సంబంధాల మీద కూడా గట్టిగానే వుంటుంది.

దేశవ్యాప్తంగా సినిమా సెలబ్రిటీల ధోరణి "నేనింతే" అన్నట్టు వుంటుంది. ఇదేమీ నేరం కాదు.

(మితిమీరిన లిక్కర్ వల్ల) పేవ్ మెంట్ మీద నిద్రిస్తున్న వారిని కారుతో తొక్కేసిన సంఘటన నేరమే! (చట్టంతెలియక) జింకను కాల్చి చంపినా నేరమే!

అల్లు అర్జున్ అలాంటి నేరం చేయలేదు. అయితే ఆయన ధర్మబద్ధంగా వ్యవహరించలేదు. తనవల్ల జరిగిన తొక్కిసలాట గురించి తెలుసు. అందులో ఒక మనిషి మరణించాక కూడా ( ఆవిషయం తనకు తెలియదంటే అది ఆయన చుట్టూ వుండే రక్షక భటుల అసమర్ధతే అవుతుంది. అందుకు బాధ్యత ఆయనదే) అల్లు అర్జున్ చివరిదాకా సినిమా చూడటం మానవీయ మర్యాదకు భంగకరమే! ఒకరోజంతా కనీసం విచారాన్ని కూడా వ్యక్తపరచకపవడం లెక్కలేనితనమే అవుతుంది. ఇవేమీ నేరాలు కాదు.

సరిగ్గా ఇక్కడే "రాజ్యం" జోక్యం చేసుకుంది. పద్ధతి ప్రకారం అరెస్టు రిమాండు జరిగిపోయాయి. జైలు వేళలకు కోర్టు ఉత్తర్వులు అందలేదు కాబట్టి రాత్రంతా అర్జున్ కు జైలు తప్పలేదు.

"చట్టం తనపని తాను చేసుకుపోతుంది" అనే మాట వెటకారపు సినిమా డైలాగుల వల్ల మనకు పలచబడి పోయింది.

ఈ కేసులో అల్లు అర్జున్ కు మహా అయితే మందలింపు తప్ప ఏ శిక్షా వుండకపోవచ్చు! లెక్కలేనితనాన్ని జవాబుదారీ తనాన్ని చక్కదిద్దడానికి "రాజ్యం" జోక్యం వల్లే ఈ అరెస్టు జరిగిందని భావిస్తున్నాను.

ఇది సెలబ్రెటీలందరికీ సంఘం పట్ల బాధ్యతను గుర్తు చేసే "రాజ్యం" / State హెచ్చరికగా కూడా భావించాలి. భావనామాత్ర మైన "రాజ్యం" ఉనికిని చూపించగలిగిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అభినందిస్తున్నాను.

**- కిలారు వంశీధర్**

# రేవంత్.. ఆ 39,568 మంది టీచర్లకు జీతాలెప్పుడు ఇస్తావ్

- **ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నట్లు చేస్తున్న డబ్బా ప్రచారాన్ని ఆపండి**
- **14 రోజులు గడిచినా జీతాలు ఇవ్వక పోవడం పట్ల మాజీ మంత్రి హరీష్ రావు ఫైర్**

**హైదరాబాద్,మహానాడు:**

ఒకటో తేదీ నాడే ఉద్యోగులకు జీతాలు అంటూ గప్పాలు కొట్టిన రేవంత్ రెడ్డి గారూ.. ఈనెల 14వ తేదీ వచ్చినా 39,568 మంది అంగన్వాడీ టీచర్లు, ఆయాలు జీతాలు రాక ఆవేదన చెందుతున్న పరిస్థితి. 10 నెలలుగా అంగన్వాడి కేంద్రాలకు అద్దెలు కూడా చెల్లించని దుస్థితి. ఏడాది కాంగ్రెస్ పాలనలో మీరు సాధించిన ఘనత ఇది. విశ్రాంత ఉపాధ్యాయులను, ఉద్యోగులను సైతం ఇబ్బందులకు గురి చేస్తున్నావు. హైకోర్టు ఉత్తర్వులు ఉంటే తప్ప హక్కుగా రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా వారిని, వారి కుటుంబాలను క్షోభకు గురి చేస్తున్నావు.

అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, విశ్రాంత ఉపాధ్యాయ, ఉద్యోగులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఇలా లక్షల మంది సకాలంలో జీతాలు రాక అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నట్లు చేస్తున్న డబ్బా ప్రచారాన్ని ఇకనైనా ఆపండి. ఉద్యోగులందరికీ సకాలంలో జీతాలు చెల్లించి మాట నిలుపుకోండి.



**నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లీలావతి అనే గురుకుల విద్యార్థినిని పరామర్శించిన మాజీ మంత్రి హరీష్ రావు, ఎల్వోపీ మధుసూదన్ చారి, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్**

# బాబుకు ప్రేమతో...

ఇక్కడంతా క్షేమం..!
ప్రియమైన మీకు..!
మీ మిత్రుడి సుపుత్రుడు వ్రాయు క్షేమ సమాచారములు.

గత ఎన్నికల్లో ఘనవిజయం సాధించి నన్ను ఘోర పరాజయము.. ఘోరపరాభవం పాల్జేసిన మీ కూటమి ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసి నాలుగు నెలలు అవుతున్నది.ఇప్పటికీ ఓటమి ని జీర్ణించుకోలేకపోతున్నాను. అసలు నమ్మలేకపోతున్నాను. నన్ను విడిచి ఒక్కొక్కరు వెళు తున్నారు.

అసలు తట్టుకోలేని విషయం ఒకటో తారీఖునే జీతాలు ఇచ్చేస్తున్నారు.

పెంచిన పెన్షన్లు వలంటీర్ల అవసరం లేకుండా పంపిణీ చేస్తున్నారు.

ఖజానా అంతా ఖాళీ చేసినా మీరు బాగానే సర్దుబాటు చేసుకోగలుగుతున్నారు.

పైకి విమర్శిస్తాము కానీ.. మీరు ఇచ్చిన హామీలు ఒక్కోటి అమలు దిశగా వెళుతున్నారు.

ఇసుక, మద్యం పాలసీ మొదట్లో కొంచెం గజిబిజి ఉన్నా మేము ఎంత అరచి గోల చేసినా అంతా సెట్ అయిపోద్ది.

నాలుగు నెలల్లో అరవై వేల కోట్లు.
బుర్ర పాడయిపోతుంది.

నా హయాంలో మా పేటీయమ్ బేచ్ కి సూట్లు వేసి హడావిడి చేసే వాళ్ళం.

అమరావతి, పోలవరం ఇంకా ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చక్కగా చేస్తున్నారు.

యదావిధిగా మేము విషం కక్కుతాము.

వరదలు, తుపానులు ఇలాంటి విపత్తులొచ్చినపుడు..
మీ కష్టం చూసి సిగ్గుపడాలి మేము.
కాని అసలు సిగ్గులేకుండా బరితెగించి దుష్ప్రచారం చేస్తున్నాము.
మీరేమి అనరన్న ధైర్యం!
ఒక్కసారి తరచి చూసుకుంటే..
నా హయాంలో తీసుకున్న నిర్ణయాలు..
జరిగిన అక్రమాలు అన్యాయాలు..
అవనీతి.. దాడులు దుర్మార్గం..
చట్ట ఉల్లంఘనలు పట్ల మీరు మీ బృందం నిత్యం తీవ్ర విమర్శలు చేసారు.

నా అధికారం అంతమైన తర్వాత మీరు కఠిన చర్యలు తీసుకుంటారేమో అని గుబులు కలిగింది.

అందుకే హడావిడి గా తాడేపల్లి వదిలి బెంగుళూరు చెక్కేసాను.


ఎందుకైనా మంచిదని ఢిల్లీ వెళ్ళి లొల్లి చేసాను.

అసలే మీరు నెమ్మది.. ఎందుకొచ్చిన గోల అని తగ్గుతారు అని!

నా స్కెచ్ వర్కవుట్ అయింది.

మా వాళ్ళని అరెస్టు చేసినా నోటీసులు తో పాటు కూల్ డ్రింక్ ఇచ్చి పంపిస్తున్నారు.

మీరంటే భయం లేదు.
కానీ, మీ అబ్బాయి లోకేష్ అన్నా
పవన్ కళ్యాణ్ అన్నా
కొంచెం అదురు ఉన్నది.





మీరు వాళ్ళ బేటరీ కూడా తీసేసినట్టున్నారు.

ఇప్పటికీ నేను చేసింది కరెక్టే అని నమ్ముతున్నాను.

నేను నమ్ముకున్న వ్యవస్థలు.. నన్ను ఎప్పటికప్పుడు నన్ను ఆదుకుంటున్నాయి.

ఇప్పటికీ అసలు ఎప్పటికీ అర్థం కాని అర్థం చేసుకోలేని విషయం ఏమిటంటే..మిమ్మల్ని మీ కుటుంబాన్ని నానా దుర్భాషలాడిన వారిని ఎందుకు వదిలేసారు

మీ పార్టీ కి దేవాలయం లాంటి ప్రధాన కార్యాలయం మీద దాడి చేసిన వారిని గెడ్డం కింద బెల్లం ముక్క పెట్టి ఎందుకు బతిమలాడుతున్నారు

నడిరోడ్డు మీద మీ కార్యకర్తల్ని ఊచకోత కోయించాను.
మీ నాయకుల్ని తుక్కు రేగ్గొట్టించాను.
మా యంపీ..
ఇప్పుడు మీ ఎమ్మెల్యే రాజుగారిని ఏకంగా ఒళ్ళు హూనం అయ్యేలా కొట్టించాను.
అసలు నేనే కొడదామనుకున్నాను.
మా వాళ్ళు ఆపారు.
మిమ్మల్ని మీ అబ్బాయిని ఎంత ఇబ్బంది పెట్టానో నాకు ఇప్పటికీ గుర్తుంది.

అలాంటిది అది అనుభవించిన మీరెలా మరచి పోయారు

అసెంబ్లీ గేటు దగ్గర ఛీఫ్ మార్షల్ని ఉసిగొలిపి మీ మీదకు పంపాను.

అతను నా కళ్ళలో ఆనందం కోసం మీ పట్ల దురుసు గా వ్యవహరించాడు.
అతని పట్ల మీ ఔదార్యం!
చాలా ఆశ్చర్యంగా ఉన్నది.
మితిమీరిన క్షమాగుణం.. దయ నేను తట్టుకోలేకపోతున్నాను.
నా బూట్లు నాకిన అధికారుల్ని మీరు క్షమించి వదిలేస్తున్నారు.
మీ సభ్యులు కూడా రాజీ చేసుకుని వాళ్ళకు అవకాశం ఇస్తున్నారు.

ఇది అసలు ఊహించలేదు.
అచ్చెంనాయుడు ని చూస్తే భయం వేసేది.
అంతెత్తున ధ్వజస్థంభం లా ఉంటాడు.
విచిత్రంగా అతను కూడా ఏమీ అనటం లేదు.
ఇలా అనేక మందిని వేధించాను..
వెంటాడాను.
నాయకులు..
కేడరు.. అధికారులు
ఎవర్నీ వదలలేదు.
ఎన్నో అపచారాలు చేసాను.
ఎంతో కొల్లగొట్టాను.
మరెన్నో అక్రమాలు చేసాను.
అమరావతి మహిళలు రైతులు వృద్ధులను అయితే అత్యంత నీచంగా జుగుప్సాకరంగా వేధించాము.
వారిని మానసికంగా కృంగదీసి కొందరి చావుకు కారణమయ్యాను.

సాక్షాత్తూ మిమ్మల్నే ఎత్తేసాను. దొంగ కేసులు పెట్టి.
అంతెందుకు ఒక్కమాటలో చెప్పాలంటే అన్నిరకాలుగా విధ్వంసం చేసాను.

నన్ను మా వాళ్ళను అలా వదిలేస్తున్నారేంటండి!

ఇంత సంయమనాన్ని నేనే తట్టుకోలేకపోతున్నాను.
మీ కేడరు, బాధితులు మీకోసం తల్లడిల్లిన వారి పరిస్థితి ఏంటో మరి

మీరు నిన్నొక మాట చెప్పారు.
కక్షరాజకీయాలు చేయను. నేనూ బాధితుడనే అని!
నోబుల్ శాంతి బహుమతి ఇవ్వాలి మీకు కచ్చితంగా!

మీ చేతుల్లో రాష్ట్రం బాగుపడుతుంది.
ప్రత్యర్థుల రక్షణ కూడా మీరే బాధ్యత తీసుకుంటారు.

అంతా అమిరిన తర్వాత ఎప్పుడో ఒకప్పుడు నేనో నాలాంటి వాడో వస్తాడు.. అప్పుడు శుభ్రంగా ఖాళీ చేస్తాడు.
మీ వాళ్ళను ఊచకోత కోస్తాడు.
అప్పుడు మీ శాంతి వచనాలు అక్కరకు రావు.
మీ కేడరు ఇప్పటికే కాడి పడేసారు.
మీరు అధికారంలో ఉన్నారు కాబట్టి తెలియటం లేదు.
మీ సామాజిక వర్గం దాదాపు అరవై డబ్భై శాతం మీకు దూరం జరిగారు.
మీరు ఎవరినైతే నమ్ముకున్నారో వాళ్ళు కష్టం లో అండగా నిలవరు.
ఇది చరిత్ర చెప్పిన సత్యం!

మీకు నాకూ తేడా ఉంది చాలా!
మీరు సౌమ్యులు..
నేను క్రూరుడను.
మీరు అభివృద్ధి కాముకులు..
నేను విధ్వంసకారుడిని!
మీరు వ్యక్తులకు ఉపయోగపడరు..
మొత్తం సమాజ హితం కోరతారు.
నేను నా వాళ్ళను చూసుకుంటాను..
సమాజం ఏమైపోయినా పర్వాలేదనుకుంటాను.
ఇలా అనేక విషయాల్లో మన ఇద్దరి మధ్య హస్తిమసికాంతరం ఉన్నది.
కాని మీకు కష్టం వస్తే ఇన్నాళ్ళూ నిలబడే వాళ్ళు ఒడేవారేమో..
ఇప్పుడు ఉండరు.
అదే నాకోసం తలతీసే వారు.. తల ఇచ్చేవారు ఉంటారు.

ఏది ఏమైనా మీరు ఆదర్శవంతులు!
తెలుగు వాడిగా గర్వపడుతున్నాను.
ఒక రకంగా ఈర్ష్యగా ఉన్నది.
ప్రజలు ఓడించారు.
మీరు నన్ను రాజకీయంగా పూడ్చిపెట్టేసారు.
నేను మాంసం కొట్టు పెట్టుకోమన్నాను.
మీరు వేలాది కార్పొరేట్ ఉద్యోగాలు ఇచ్చి నా మీదపై చేయి సాధిస్తున్నారు.

మరొక్కసారి మీ ఔదార్యానికి.. పెద్దమనసుకి ప్రణామములు!
చివరగా మీ కేడరు ఎందుకు అసహనంగా ఉన్నారో చూసుకోండి.
ఇప్పటికింతే సంగతులు!
కొద్దిరోజుల్లో మరొక లేఖ ద్వారా క్షేమసమాచారములు తెలియచెయ్యగలవాడను.
ఇట్లు
మీ ప్రియమిత్రుడి సుపుత్రుడు

**-అడుసుమిల్లి శ్రీనివాసరావు**

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | ఆదివారం 15, డిసెంబర్ 2024

## అల్లు అర్జున్ అరెస్టు ఎపిసోడ్‌లో రెండు “ఇగో”లు





ఇటీవల పుష్పకు సంబంధించిన ఒక కార్యక్రమంలో వేదిక మీద సాక్షాత్తు తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరు మర్చిపోయిన అల్లు అర్జున్‌కి.. ఇప్పుడు ముఖ్యమంత్రి ఎవరు ఏమిటి అనేది జీవితాంతం గుర్తుండిపోయేలా చేశారు రేవంత్ రెడ్డి.

పుష్ప-2 సినిమాలో పోలీసు అధికారిని స్విమ్మింగ్ పూల్లో దొబ్బేసి అక్కడ మూత్రం పోసే అవమానకరమైన, అసహ్యమైన సన్నివేశం చాలామంది పోలీసు అధికారుల ఇగోని రెచ్చగొట్టింది అని టాక్. పోలీసుల మీద ఇలాంటి సన్నివేశాలు గతంలో ఉండవచ్చు. కానీ ఇంత అసహ్యకరమైన సన్నివేశాలు ఏనాడూ లేవు కదా ఆ కసిని పోలీసులు ఇలా తీర్చుకున్నారని ప్రేక్షకుల టాక్. సంధ్య థియేటర్ దుర్ఘటన మీద కేసు పెట్టి అరెస్టు చేయాలి అనుకుంటే, ఇన్ని రోజులు వేచి చూడాల్సిన అవసరం లేదు.

ఎంత ప్లాను లేకపోతే శుక్రవారం నాడు అరెస్టు చేసి జైల్లో వేసేలా చేస్తారు మధ్యంతర బెయిల్ ఇప్పుడు వచ్చి ఉండవచ్చు. కానీ లేకపోతే మూడు రోజులు జైల్లో మగ్గి ఉండాల్సింది. అక్కడికి ఒక రోజు జైల్లో వేసి తమ ఇగో ని ముఖ్యమంత్రి మరియు పోలీసులు సంతృప్తి పరుచుకున్నారు అనిపిస్తుంది. అందుకే బెయిల్ పేపర్ల వ్యవహారాన్ని రాత్రి పొద్దుపోయేదాకా నడిపించారట!

**- ప్రవీణ్**



## హిందూ ధర్మాన్ని కించపరిచే ఉద్దేశం లేదు

- ఎమ్మెల్యే గళ్లా మాధవి

**తాడేపల్లి, మహానాడు:** హిందూ ధర్మాన్ని కించపరిచే ఉద్దేశం నాకు లేదని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు. కుంచనపల్లిలోని “హరే కృష్ణ గోకుల క్షేత్రం”లో శనివారం జరిగిన లక్ష్మీ నరసింహస్వామి హోమానికి హాజరయ్యి, రాధాకృష్ణుల స్వామివారిని దర్శించుకొని అనంతరం భక్తులకు ఉచితంగా భగవద్గీతను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే గళ్ళ మాధవి, ఇస్కాన్ ప్రతినిధి విలాస విగ్రహ దాస్ లు మీడియాతో మాట్లాడారు. నరసింహ స్వామి యజ్ఞంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నాను. ట్రాఫిక్ సమస్యల మీద నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటించాను. ట్రాఫిక్‌కు ఇబ్బంది పెట్టే అనేక వర్గాల వారికి పలు సూచనలు చేశాం. ఇస్కాన్ భక్తులు వాహనాలు ఆపి భగవద్గీతను విక్రయిస్తుండటంతో నేను వారిని “ఒక స్టాల్”ఏర్పాటు చేస్తాను ఈ స్టాల్ లో విక్రయించుకోండి అని మాత్రమే సూచించాను. దీనిని కొంతమంది వక్రీకరించారు.

హిందూధర్మాన్ని కించపరచటం, అడ్డుకోవటం వంటి దురుద్దేశాలు లేవని స్పష్టం చేశారు.

ఇస్కాన్ ప్రతినిధి విలాస విగ్రహదాస్ మాట్లాడుతూ గత గత రెండు రోజుల కిందట కొంతమంది భక్తులు ఢిల్లీ నుండి వచ్చి భగవద్గీత పుస్తకాలను విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో కొంత సమన్వయ లోపం జరిగింది. వారు కొంత ఉత్సాహంతో బైకులో కారు ఆపి విక్రయిస్తున్నారని కూడా మా దృష్టికి వచ్చింది. ఈ కార్యక్రమం రోడ్డు మీద కాకుండా సముచిత స్థానంలో ఏర్పాటు చేసి విక్రయిస్తే బాగుంటుందని ఎమ్మెల్యే సూచించారని దాస్ తెలిపారు. ఎమ్మెల్యే ఆది నుండి ఇస్కాన్ కు ఎంతో అండగా నిలుస్తూ వస్తున్నారని చెప్పారు.

## బాబు విజన్-2047 ఆచరణాత్మకం కాని ఒక భ్రమ

- చంద్రబాబు స్వయం ప్రకటిత విజనరీ
- చంద్రబాబు విజన్ పేదల పాలిట శాపం
- తనహయాంలో పనిచేసిన ఐఎఎస్ లకు చెందిన ఎన్జీఓతో ఈ డాక్యుమెంట్ రూపకల్పన
- అల్లు అర్జున్ అరెస్ట్ కక్షసాధింపు చర్య
- సెన్సేషనలిజం కోసం తెలంగాణ ప్రభుత్వం ఈ అరెస్ట్ చేసింది
- కాకినాడ క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాజీమంత్రి, కాకినాడ జిల్లా పార్టీ అధ్యక్షుడు కురసాల కన్నబాబు ఆగ్రహం



**కాకినాడ:** సీఎం చంద్రబాబు ఆవిష్కరించిన తాజా విజన్-2047 ఆచరణకు పనికి రాని ఒక డ్రామా అని మాజీ మంత్రి, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు విమర్శించారు. కాకినాడ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఒక స్వయం ప్రకటిత విజనరీ అని, గతంలో ఆయన ప్రకటించిన రెండు విజన్లలోని లక్ష్యాలను ఏ మేరకు సాకారం చేశారో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు విజన్ అంటేనే పేదవారి విధ్వంసంగా అర్థం చేసుకోవచ్చని అన్నారు.

ఇంకా ఆయన ఏమన్నారంటే... గతంలో చంద్రబాబు రెండుసార్లు విజన్ డాక్యుమెంట్ లను రిలీజ్ చేశాడు. ఇప్పుడు విజన్ 2047 అంటూ మరో డాక్యుమెంట్ ను రిలీజ్ చేశారు. ఈ దేశంలో తానే ఒక గొప్ప విజనరీగా భ్రమపడే చంద్రబాబు, ప్రజలను కూడా తన పబ్లిసిటీ స్టంట్ లతో భ్రమల్లో ఉంచేందుకు ప్రయత్నిస్తున్నారు. దీనిలో భాగంగానే ఈ తాజా విజన్ 2047 డాక్యుమెంట్. ఒక్కమాటలో చెప్పాలంటే ఇది కొత్త సీసాలో పాత సారా. 1995-2004 మధ్య, 2014-19 మధ్య సీఎంగా చంద్రబాబు ప్రకటించిన రెండు విజన్ లలో ఒక్క లక్ష్యాన్ని అయినా సాధించిన దాఖలాలే లేవు. చంద్రబాబు తాజాగా విజన్-2047 డాక్యుమెంట్ రిలీజ్ చేశారు. రెండు మూడు రోజుల నుంచి మీడియాలో పెద్ద ఎత్తున దీనిపైనే ప్రచారం చేసుకుంటున్నారు. జనాలను మభ్యపెట్టడం ఎలా అనే అంశంపై చంద్రబాబు పుస్తకం రాస్తే, ఈ ప్రపంచంలోనే అత్యధికంగా అది అమ్ముడు పోతుంది.

చంద్రబాబు గతంలో రిలీజ్ చేసిన విజన్-2020, విజన్-2029 అనే డాక్యుమెంట్ డ్రామాలు ప్రజలను ఎలా మోసం చేశాయో కమ్యూనిస్ట్ లు ఆనాడే ప్రజలకు గుర్తు చేశారు. గతంలో ఆయన ప్రకటించిన డాక్యుమెంట్లను అధ్యయనం చేసిన కమ్యూనిస్ట్ లు విజన్-2020 చంద్రబాబు-420 అనే నినాదం కూడా చేసేవారు. విజన్ 2020 తరువాత రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి 2.4 శాతం నుంచి 0.29 శాతానికి పడిపోయింది, రాష్ట్ర జీడీపీ ఏకంగా 5 శాతం లోపే నమోదు అయిన విషయం వాస్తవం కాదా

రైతులకు రూ.20 వేల సాయం అంటూ హామీ ఇచ్చారు. దానిని కూడా ఆరునెలలైన అమలు చేయడం లేదు. ఉన్న ఉచిత పంటల బీమాను కూడా ఎత్తేశారు ధాన్యం కొనుగోళ్ళు చేయడం లేదు, గిట్టుబాటు ధర కల్పించడం లేదు. నిలువునా రైతులను దగా చేస్తున్న మీరు విజన్ 2047లో రైతులను ఉద్ధరిస్తానని చెబుతుంటే, ప్రజలు నవ్వుకుంటున్నారు.

విద్యను, వైద్య రంగాల్లో దీర్ఘకాలిక ప్రయోజనాలను ఇచ్చే ప్రాజెక్ట్ లను తీసుకు రాకుండా, తాను విజనరీని అని చంద్రబాబు ఎలా చెప్పుకుంటారు కాకినాడ జనరల్ ఆసుపత్రిలో సరిపడా ఇన్సులిన్ లేదు. ఇది మీ ప్రభుత్వ పరిస్థితి. మేం వైయస్ఆర్ హెల్త్ క్లినిక్స్ లో గ్రామస్థాయిలో సరిపడినన్ని మందులతో ప్రజలకు వైద్యాన్ని చేరువ చేస్తే, చంద్రబాబు సీఎం కాగానే దానికి మంగళం పాడారు. అటువంటి మీరు విజన్ ద్వారా అభివృద్ధిని, సంతోషాన్ని ఇస్తానని చెప్పుకోవడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు.

1998లో చంద్రబాబు ప్రభుత్వం మెకన్సీ అనే విదేశీ కన్సల్టెన్సీకి దాదాపు రూ.2.5 కోట్లు చెల్లించి విజన్ 2020 రూపొందించుకున్నారు. దీనిని చూసి ప్రపంచంలోని నిపుణులు ఆశ్చర్య పోయారు. చంద్రబాబు ప్రపంచంలోని ప్రముఖుల ప్రశంసలు కావాలనే ఆలోచనతో నేను సీఎంను కాదు, సీఈఓను అని ప్రకటించుకున్నారు. మెకన్సీ చేసిన విజన్-2020 డాక్యుమెంట్ చూస్తే విద్యా, వైద్యాన్ని పూర్తిగా ప్రైవేటుపరం చేసి, ప్రజల నుంచి యూజర్ చార్జీలను వసూలు చేయాలని ప్రతిపాదించారు. అంటే ప్రజలకు ఉచితంగా విద్యా, వైద్యంను అందించాల్సిన బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పుకుని, ప్రైవేటువారికి ఇవ్వాలనే లక్ష్యం మీకు ఉన్నట్లు ప్రకటించుకున్నారు. ఇదేనా మీ విజన్ చంద్రబాబు తాజాగా ప్రకటించిన విజన్‌లో ప్రజాభాగస్వామ్యం ఎక్కడ ఉంది ఈ రాష్ట్రంలోని మేధావులు, నిపుణుల అభిప్రాయాలు తీసుకున్నారా రైతులు, ప్రజల ముందు పెట్టి వారి అభిప్రాయాలు కోరారా దీనిపై ఎక్కడైనా చర్చకు పెట్టారా చంద్రబాబుకు అత్యంత సన్నిహితంగా ఉండే కొందరు రిటైర్డ్ ఐఎఎస్ అధికారులకు చెందిన ఎన్జీఓ సంస్థలతో ఈ విజన్ తయారు చేయించారు. అంతేకానీ నిజంగా ఈ రాష్ట్రానికి ఏం కావాలి, ఎటువంటి లక్ష్యాలు ఉండాలి అనే ఆలోచనలు దీనిలో లేవు.

గతంలో విజన్ 2020 ప్రకటించిన తరువాత 54 ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించారు. విద్యుత్ రేట్లను పెంచడం, అడిగిన రైతులపై కాల్పులు చేయించారు. ఆనాడే కమ్యూనిస్ట్ లు చంద్రబాబు వరల్డ్ బ్యాంక్ జీతగాడు అంటూ ఒక బిరుదు ఇచ్చారు. ఇప్పుడ మళ్ళీ విజన్ 2047 అంటున్నారు. పద్నాలుగేళ్ళు సీఎంగా ఉండి ఒక్క పోర్ట్ అయినా కట్టాడా ఒక ఫిషింగ్ హార్బర్ కట్టాడా తెచ్చిన ఒక కాకినాడ సీపోర్ట్ ఎడిబి రుణంతో నిర్మించి, తర్వాత తనకు కావాల్సిన వారికి దారాదత్తం చేశారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే విద్యుత్ చార్జీలను పెంచడం ద్వారా రూ.15వేల కోట్లు ప్రజలపై భారం వేయడాన్ని సంపద సృష్టి అంటారా ఈ రోజు పంచాయతీల్లో పన్నులను పెంచి ప్రజలపై భారం వేయబోతున్నారు.

ఎంతో విజన్ ఉన్న చంద్రబాబు తన పాలన 14 ఏళ్ళలో ప్రతిఏటా రెవెన్యూ లోటుతోనే బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. ఇన్ని సంవత్సరాల పాటు రెవెన్యూ లోటు మరే ప్రభుత్వంలోనూ లేదు. ఇదేనా మీ పాలనా సామర్థ్యం కలెక్టర్స్ కాన్ఫరెన్స్ లో ఒక ఐఎఎస్ అధికారి వరల్డ్ బ్యాంక్ నుంచి రూ.15వేల కోట్లు రుణం మంజూరయ్యింది. దీనిలో 3700 కోట్లు ముందే వచ్చేస్తుంది, దీనితో అమరావతిలో పనులు వెంటనే ప్రారంభించవచ్చు అని చెప్పగానే అందరూ చప్పట్లు కొట్టారు. రూ.15 వేల కోట్ల అప్పు దొరికిందని ఆనందిస్తున్నారే కానీ, పేదలకు పదిరూపాయలు ఖర్చు చేయడంలో ఉన్న ఆనందాన్ని మాత్రం పట్టించుకోవడం లేదు. మంచి జరిగితే మాదే అంటున్నారు. సరిగా జరగకపోతే అధికారుల వైఫల్యం అంటారా

### సినీ హీరో అల్లు అర్జున్ అరెస్ట్ వెనుక కుట్ర

సినీహీరో అల్లు అర్జున్ అరెస్ట్ ఉద్దేశపూర్వకంగా కక్ష సాధింపులో భాగంగానే జరిగింది. శుక్రవారంనాడు అరెస్ట్ చేసి జైలుకు పంపి కనీసం సోమవారం వరకు బెయిల్ రాకుండా ఉండే కుట్ర దీనిలో ఉంది. ఆయన వెళ్ళిన థియేటర్ వద్ద తొక్కిసలాటలో ఒక మహిళ చనిపోవడం, మరో బాలుడు గాయపడటం బాధాకరం. అయితే ఈ సంఘటనకు తెలంగాణ పోలీస్ వైఫల్యం లేదా, రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఫల్యం లేదా అల్లు అర్జున్ ను అరెస్ట్ చేయడంలో మీరు చూపించిన శ్రద్ధ మీ యంత్రాంగం వైఫల్యంపైఎందుకు చూపడం లేదని ప్రశ్నిస్తున్నాం.

గతంలో ప్రమాదవశాత్తు జరిగిన తొక్కిసలాటల్లో చాలా ప్రాణాలు పోయిన సందర్భాలు ఉన్నాయి. ఈ ఘటనలను అడ్డం పెట్టుకుని కక్షసాధించే విధంగా చర్యలు తీసుకుంటే ఆనాడు రాజమండ్రి పుష్కరాల్లో జరిగిన ఘటనలో చంద్రబాబును అరెస్ట్ చేసి ఉండేవారు కాదా ఆ ఘటనలో 27 మంది చనిపోయారు. కనీసం నా వల్ల తప్పు జరిగిందనే పశ్చాత్తాపం కూడా చంద్రబాబు వెల్లడించలేదు. ఎందుకు చంద్రబాబుపై చర్యలు తీసుకోలేదు. అసలు ఆ సంఘటనకు ఎవరూ బాధ్యులే లేరా అంతేకాదు గత ఎన్నికల్లో గుంటూరులో చంద్రబాబు సభలో చీరెలు పంచడానికి వెడితే తొక్కిసలాటలో ముగ్గురు చనిపోయారు. కందుకూరులో ఒక ఇరుకు సందులో జనం కనిపించాలనే ఉద్దేశంతో చంద్రబాబు సభ పెడితే కాలువలో పడి ఎనిమిది మంది మరణించారు. దీనికి బాధ్యుడిని చేస్తూ చంద్రబాబును అరెస్ట్ చేయలేదు. దేశ వ్యాప్తంగా ఇటువంటి ఘటనలు చాలా జరిగాయి. ఈ ఘటనల్లో ఎవరిపైన చర్యలు తీసుకున్నారు ఇవి ప్రమాదవశాత్తు జరిగిన ఘటనలు, వీటిని తమకు గిట్టని వారికి వ్యతిరేకంగా తప్పుడు కేసులు బనాయించే సందర్భాలుగా మలుచుకోవడం బాధాకరం.

నిన్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మాటలు చాలా ఆశ్చర్యం కలిగిస్తోంది. చట్ట ప్రకారం అరెస్ట్ చేసే ముందు అల్లు అర్జున్ కు నోటీసులు ఇచ్చారా, ముందస్తు విచారణకు పిలిచారా ఉద్దేశ పూర్వకంగా కేసు నమోదు చేసినట్లు కాదా దీనిని మాజీ సీఎం జగన్ తీవ్రంగా ఖండించారు. జాతీయ మీడియా కూడా ఇది తప్పు అని చెబుతోంది. కేంద్రంలోని మంత్రులు కూడా దీనిని ఖండించారు.

# అల్లు అర్జున్ విడుదల

- చంచల్గూడ జైలు వెనక గేటు నుంచి ఎస్కార్టో ఇంటికి
- రాత్రంతా జైలులోనే
- ఫుడ్ తీసుకోని బన్నీ
- నేలపైనే నిద్ర
- పుష్పరాజ్ ఒక్కరాత్రి జైలు జీవింత




**హైదరాబాద్, మహానాడు:**
సంధ్య థియేటర్ ఘటన కేసులో అరెస్టయిన అల్లు అర్జున్ చంచల్గూడ జైలు నుంచి శనివారం ఉదయం విడుదల అయ్యారు. - శుక్రవారం అర్ధరాత్రి వరకు కొనసాగిన ఉత్కంఠత - హైకోర్టు నాలుగు వారాల మధ్యంతర బెయిలు మంజూరు చేసింది. అయితే, బెయిల్ పేపర్లు ఆలస్యం కావడంతో.. శుక్రవారం రాత్రి ఆయన జైలులోనే ఉండాల్సి వచచింది. పేపర్లు సమర్పించిన తర్వాత శనివారం ఉదయం 6.30 గంటలకు అల్లు అర్జున్ను బయటకు పంపించారు.

ఈ నెల 4న పుష్ప-2 ప్రీమియర్ షో సందర్భంగా హైదరాబాద్ సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాటలో మహిళ మృతి చెందిన కేసులో సినీ నటుడు అల్లు అర్జున్ అరెస్టు, రిమాండ్, అనంతరం మధ్యంతర బెయిల్‌తో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. చిక్కడపల్లి పోలీసులు ఆయనను శుక్రవారం మధ్యాహ్నం అరెస్ట్ చేసి, వాంగ్మూలం, వైద్య పరీక్షల అనంతరం నాంపల్లి న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారు. కోర్టు 14 రోజులు జ్యుడీషియల్ రిమాండ్ విధించటంతో చంచల్‌గూడ జైలుకు తరలించారు. జైలు గేటు వద్ద ఆయన ఏఆర్ సిబ్బందితో గొడవపడినట్టు సమాచారం. జైల్లో ఆయనకు మంజీరా బ్యారక్ కేటాయించారు.

### ఒక్క రాత్రి

మంజీరా బ్యారక్‌లో బన్నీ ఉండగా.. ఇతర కేసులకు సంబంధించిన ఇద్దరున్నారు. జైలులో కొంత సమయం ముభావంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే హైకోర్టు మధ్యంతర బెయిల్ ఇవ్వటంతో అల్లు అర్జున్ కుటుంబ సభ్యులు, అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. అర్జున్‌తో పాటు సంధ్య థియేటర్ యజమానులిద్దరికి కూడా మధ్యంతర బెయిలు మంజూరైంది. అర్జున్ 50 వేల వ్యక్తిగత బాండ్‌ను చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్‌కు అందజేయాలని హైకోర్టు ఆదేశించింది. అర్నబ్ గోస్వామి వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర, భజన్‌లాల్ కేసులను ప్రస్తావిస్తూ మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీదేవి తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

చిత్ర కథానాయకుడు రాబోతున్నందున తగిన బందోబస్తు కల్పించాలంటూ సంధ్య థియేటర్ యాజమాన్యం పోలీసులకు వినతిపత్రం ఇవ్వడం, దాన్ని ఆమోదిస్తూ పోలీసు అధికారులు స్టాంపు వేసిన విషయాలనూ పరిగణనలోకి తీసుకున్నట్లు న్యాయమూర్తి పేర్కొన్నారు. ఈ కేసు దర్యాప్తు కొనసాగించవచ్చని, అందులో పిటిషనర్లు జోక్యం చేసుకోరాదని, పోలీసులకు సహకరించాలని సూచించారు. అయితే శుక్రవారం రాత్రి 7 నుంచి 9 గంటల్లోపు అల్లు అర్జున్ విడుదల అయ్యే అవకాశాలున్నాయని ప్రచారం జరిగింది.

అల్లు అర్జున్ తరపు న్యాయవాదులు, మామ చంద్రశేఖర్ రెడ్డి జైలు వద్దకు చేరుకున్నారు. ఎస్కార్ట్ సిబ్బందితో చంద్రశేఖర్ రెడ్డి గొడవకు దిగటంతో ఆయనను డబీర్‌పురా పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

బెయిల్ పత్రాలు రాత్రి 10 గంటలకు తర్వాత చేరటంతో విడుదల ఆలస్యం అయింది. శుక్రవారం రాత్రి వరకు జైలు దగ్గరే అల్లు అరవింద్తో పాటు కొంతమంది ఉన్నప్పటికీ.. కొంత సమయానికి జైలు వద్ద వదలి వెళ్లారు. కుమారుడితో కలిసి వెళ్లేందుకు వచ్చిన అల్లు అరవింద్ రాత్రి 10 గంటలకు ఇంటిముఖం పట్టారు. ఏ సమయంలోనైనా ఆయన విడుదల కావచ్చనే సమాచారంతో చంచల్‌గూడ వద్దకు భారీగా అభిమానులు చేరుకున్నారు. బెయిల్‌కు సంబంధించిన పత్రాలు జైలు అధికారులకు రాత్రి 10 గంటలకు తర్వాత చేరటంతో చంచల్‌గూడ జైల్లోనే ఉండేందుకు ఏర్పాట్లు చేశారు.

సాధారణంగా ఆలస్యంగా వచ్చిన బెయిల్ ఉత్తర్వులకు సంబంధించిన విచారణ ఖైదీలను మరుసటి రోజు విడుదల చేయటం ఆనవాయితీ. ఇదే క్రమంలో అల్లు అర్జున్ నేడు విడుదల అయ్యారు. ప్రధాన గేటు ముందు మరోసారి అభిమానులు భారీగా గుమిగూడటంతో జైలు వెనక గేటు నుంచి ఎస్కార్ట్ వాహనంలో నివాసానికి పంపించారు. శుక్రవారం అర్ధరాత్రి వరకే ప్రాసెస్ కంప్లీట్చేశారు. ఆయన తరఫు న్యాయవాదులు రూ.50 వేల పూచీకత్తును జైలు సూపరింటెండెంట్‌కు సమర్పించారు.

శుక్రవారం రాత్రే ఆయన జైలు నుంచి విడుదల కావాల్సి ఉండగా.. బెయిల్ పత్రాలు జైలు అధికారులకు ఆలస్యంగా అందడంతో బన్నీ రాత్రంతా జైల్లోనే ఉండాల్సి వచ్చింది.

### ఆలస్యంపై లీగల్‌గా పోరాడుతాం

బన్నీ రిలీజ్ ఆలస్యంపై లీగల్‌గా పోరాడతామని ఆయన తరఫు న్యాయవాది అశోక్ రెడ్డి అన్నారు. జైలు అధికారులు ఆయన విడుదలను ఆలస్యం చేశారని.. హైకోర్టు ఆదేశాల్లో వెంటనే విడుదల చేయాలని ఉన్నా అవి అమలు కాలేదని చెప్పారు. దీనిపై పోలీసులు, ప్రభుత్వం సమాధానం చెప్పాలని అన్నారు.

### నేలపైనే నిద్ర..

అల్లు అర్జున్ శుక్రవారం రాత్రే విడుదల కావాల్సి ఉండగా.. వివిధ కారణాలతో జాప్యం జరిగింది. రాత్రి 10:30 వరకూ ఆయన రిసెప్షన్‌లోనే ఉండగా.. అనంతరం ఖైదీలందరూ బ్యారక్‌కు వెళ్లిన తర్వాత మంజీర బ్యారక్ క్లాస్ - 1 రూంలో ఉంచారు. జైలు అధికారులు ఫుడ్ ఇచ్చినా బన్నీ తీసుకోలేదని తెలుస్తోంది. ఆయనకు కొత్త రగ్గు, దుప్పటి ఇవ్వగా సాధారణ ఖైదీలాగే నేల మీదే పడుకున్నట్లు సమాచారం.

14 రోజుల రిమాండ్ విధించినప్పుడు న్యాయాధికారి ఆయన్ను ప్రత్యేక ఖైదీగా పరిగణించాలని ఆదేశించారు. ఈ సౌకర్యాలు జైల్లోకి వచ్చిన మర్నాడు మాత్రమే అందుతాయి. అయితే, బన్నీ రాత్రి విడుదల కాకపోవడంతో కుటుంబ సభ్యులు, అభిమానులు నిరాశతో వెనుదిరిగారు. అల్లు అరవింద్ తీవ్ర అసహనంతో సొంత కారు వదిలి క్యాబ్‌లో వెళ్లిపోయారు.

అల్లు అర్జున్ అరెస్ట్ నుంచి విడుదల వరకూ క్షణ క్షణం తీవ్ర ఉత్కంఠ నెలకొంది. బన్నీ అరెస్ట్ అయ్యారన్న విషయం తెలుసుకున్న టాలీవుడ్ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. మెగాస్టార్ చిరంజీవి దంపతులు సహా ప్రముఖులు అల్లు అరవింద్ ఇంటికి వెళ్లారు. సినీ హీరోలు సహా రాజకీయ ప్రముఖులు ఆయన అరెస్టును తీవ్రంగా ఖండించారు.

జనం గుండె చప్పుడు

మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ | ఆదివారం 15, డిసెంబర్ 2024

# అప్రజాస్వామికంగా ఆంధ్రాను విభజించారు!

- లోక్ సభలో టీడీపీ ఫ్లోర్ లీడర్ లావు శ్రీకృష్ణదేవరాయలు

**న్యూఢిల్లీ:** ఆంధ్రప్రదేశ్‌ను 2014లో అప్రజాస్వామికంగా విభజించారని, విభజనను రాష్ట్ర అసెంబ్లీ తిరస్కరించినా పట్టించుకోలేదని, ఓటింగ్ డేటాపై పారదర్శకత లేకుండా పార్లమెంటులో బిల్లును ఆనాడు ఎలా ఆమోదించారని, ఇది రాజ్యాంగ స్ఫూర్తి, విలువకు విరుద్ధం అని, అప్రజాస్వామి చర్య అని తెలుగుదేశం పార్టీ(టీడీపీ) ఫ్లోర్ లీడర్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు విమర్శించారు. భారత రాజ్యాంగం 75 ఏళ్ల ఉజ్వల ప్రస్థానంపై లోక్‌సభలో జరిగిన చర్చలో శ్రీకృష్ణ దేవరాయలు ప్రసంగించారు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్ఫూర్తి ప్రస్తుత భారతదేశానికి వివక్షకు వ్యతిరేకంగా పోరాడటానికి, ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టడానికి వెన్నెముకలా పనిచేసిందని పేర్కొంటూ, రాజ్యాంగ మైలురాళ్లను ప్రస్తావించారు. మిగతా దేశాలు తమ రాజ్యాంగాన్ని తరుచూ సవరించున్నప్పటికీ, మనదేశం మాత్రం 75 ఏళ్ళుగా అదే విశేషమైన విలువతో రాజ్యాంగ కొనసాగింపును ప్రశంసించారు. ఇంతటి గొప్ప రాజ్యాంగ నిర్మాణంలో 389 మంది పాలుపంచుకోగా, అందులో 13 మంది తెలుగు వారు ఉండటం ఎంతో గర్వకారణం అని పేర్కొన్నారు. ఇదే ఒరవడితో పాలనను పటిష్ఠం చేయడానికి కొన్ని సవరణలను ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు ప్రతిపాదిం చారు.

విద్యా హక్కు (ఆర్టిఇ)ని విస్తృత పరిధికి విస్తరించడం, జనాభా తగ్గుతున్న రాష్ట్రాలను పరిగణలోకి తీసుకోవడానికి డీలిమిటేషన్ ప్రమాణాలను సవరించడం, బిల్లులకు ఆమోదం తెలిపేందుకు



గవర్నర్లకు కాలపరిమితి విధించడం, అట్టడుగు ప్రజాస్వామ్యాన్ని శక్తివంతం చేయడానికి ఒక దేశం, ఒకే ఎన్నికలలో స్థానిక ఎన్నికలను మిళితం చేయడం, ఆన్‌లైన్ గేమింగ్ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను చేర్చడానికి 7వ షెడ్యూల్ విస్తరన వంటివి లేవనెత్తారు. తెలుగుదేశం పార్టీకి రాజ్యాంగంపై అచంచలమైన విశ్వాసం ఉందని, భవిష్యత్తు తరాలకు ప్రజాస్వామ్య ఆదర్శాలను కాపాడేందుకు నిబద్ధతతో పనిచేసేందుకు కట్టుబడి ఉంటుందని ప్రస్తావించారు.

# డోకిపర్రులోని శ్రీ భూసమేత శ్రీ వెంకటేశ్వర స్వామికి సీఎం విశేష పూజలు

- హెలీపాడ్ వద్ద ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే రాము, కూటమి నేతలు
- ఎమ్మెల్యే రాము, కూటమి నేతలతో ముచ్చటించిన సీఎం చంద్రబాబు

**గుడ్లవల్లేరు, మహానాడు:** గుడ్లవల్లేరు మండలం, డోకిపర్రు గ్రామంలో సీఎం చంద్రబాబు నాయుడు శనివారం సాయంత్రం పర్యటించారు. గ్రామంలోని హెలిపాడ్ వద్ద గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకల్ల



నారాయణరావు, ఏపీ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎంకు నాయకులు పుష్పగుచ్చాలు అందజేశారు. అనంతరం డోకిపర్రులోని శ్రీ భూసమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానానికి చేరుకున్న సీఎం చంద్రబాబు.. ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారు. ముందుగా దేవస్థాన ప్రాంగణంలో ప్రదక్షిణలు నిర్వహించిన సీఎం చంద్రబాబు... స్వామివారిని దర్శించుకొని విశేష పూజలు నిర్వహించారు.

అనంతరం సీఎం చంద్రబాబుకు వేద పండితులు వేద ఆశీర్వచనాలు అందజేయగా.. దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతులు శేష వస్త్రాలతో ఆలయ సంప్రదాయం ప్రకారం సీఎం చంద్రబాబును సత్కరించి స్వామివారి ఫోటోను, లడ్డు ప్రసాదాన్ని అందజేశారు. డోకిపర్రు మహాక్షేత్రం అద్భుతమని దర్శన అనంతరం సీఎం చంద్రబాబు అన్నారు. హిందూ ధర్మ పరిరక్షణకు ఇలాంటి క్షేత్రాలు మరిన్ని ఏర్పాటు కావాలనీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా డోకిపర్రు మహాక్షేత్రం విశిష్టతను కృష్ణారెడ్డి, వేద పండితులు... సీఎం చంద్రబాబుకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, స్థానిక టీడీపీ నాయకులతో సీఎం చంద్రబాబు కొద్దిసేపు ముచ్చటించారు. తిరుగు ప్రయాణంలో సీఎం చంద్రబాబు ఎమ్మెల్యే రాముతో ప్రత్యేకంగా మాట్లాడారు. పర్యటన ముగిసిన అనంతరం హెలికాప్టర్లో సీఎం చంద్రబాబు గన్నవరం పయనమయ్యారు. హెలికాప్టర్ ఎక్కే ముందు నియోజకవర్గ నాయకులను ఎమ్మెల్యే రాము సీఎం చంద్రబాబు పరిచయం



చేశారు.

సీఎం చంద్రబాబు పర్యటనలో గుడివాడ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి బూరగడ్డ శ్రీకాంత్, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, గుడివాడ బీజేపీ కన్వీనర్ దావులూరి సురేంద్రబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి, సీనియర్ టీడీపీ నాయకులు పిన్నమనేని బాబ్జి, వీరమాచనేని శివప్రసాద్, పురిటిపాటి వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్ జ్యోతి, వీరమాచనేని రత్నాకరరావు, చేకూరు జగన్మోహన్రావు, జనసేన నాయకులు తోట చిన్నారి, పలువురు కూటమి నాయకులు, అధికార ప్రముఖులు పాల్గొన్నారు.

### జమిలితోనే అభివృద్ధి సాధ్యం: సీఎం

పూజా కార్యక్రమం అనంతరం ఆలయం నిర్మాణాన్ని పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. 'వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని కృష్ణారెడ్డి దంపతులు ఘనంగా అభివృద్ధి చేశారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్‌లో పేదరిక నిర్మూలనకు గురించి ప్రస్తావించాం. 2047 నాటికి ప్రపంచంలో భారతదేశం, దేశంలో ఏపీ అగ్రభాగాన ఉంటాయి. జమిలి విధానంలో భాగంగా దేశంలో ఎన్నికలన్నీ ఒకసారి జరిగితే అభివృద్ధి చేసుకోవడానికి ఎక్కువ సమయం ఉంటుంది. మూడు నెలలకు ఒకసారి దేశంలో ఎన్నికలు జరుగుతూ ఉంటే పాలకులు ఎన్నికల కోసమే పని చేయాల్సి ఉంటుంది.' అని అన్నారు. పీ4 విధానంలో భాగంగా గుడ్ల వల్లేరు మండలంలోని బీపీఎల్ కుటుంబాలకు చేయూత నిచ్చేందుకు చొరవ తీసుకోవాలని కృష్ణారెడ్డికి సీఎం చంద్రబాబు సూచించగా ఆయన అంగీకరించారు. ప్రతి జిల్లా, ప్రతి మండలం, ప్రతి గ్రామంలోని పేదలను ఆర్థికంగా పైకి తీసుకొచ్చేందుకు పారిశ్రామిక వేత్తలు తోడ్పాటునందించాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.

# నేడు పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినంగా ప్రత్యేక కార్యక్రమాలు

- ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి పార్థసారథి

**విజయవాడ, మహానాడు:** పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఈనెల 15వ తేదీ ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం ఆత్మార్పణ దినంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ మేరకు రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శనివారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏర్పా ట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి తోపాటు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, ప్రజలు తదితరులు హాజరవుతారు. ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుకు ఆమరణ



నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు త్యాగాన్ని స్మరించు కుంటూ రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠా త్మకంగా నిర్వహించనుందని.. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు సమ న్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా మంత్రి అధికారులు, సిబ్బందికి సూచించారు. రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లా.. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు చేయా ల్సిన ఏర్పాట్లపై అధికారులకు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

# హీరోలకు ఇచ్చే ప్రాధాన్యత రైతులకు ప్రభుత్వాలు ఇవ్వరా?

- ఆరు నెలల్లో రెండుసార్లు విద్యుత్ చార్జీలు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదే
- జన సేవాదళ్ ముగింపు సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ
- జన సేవాదళ్ రెడ్ షర్ట్ వాలంటీర్స్ శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా కవాతు నిర్వహించిన ఎర్రదండు,శత వసంతాల సూచికగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన 100 మీటర్ల సిపిఐ జెండా

**నందిగామ:** తెలుగు రాష్ట్రాల్లో సినిమా హీరోలకి ఇచ్చే ప్రాధాన్యత రైతులకు లేకుండా పోయిందని సిపిఐ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి కె రామకృష్ణ విమర్శించారు సిపిఐ శతజయంతి ప్రారంభ ఉత్సవాలలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ ఆధ్వర్యంలో గత ఐదు రోజులుగా నందిగామ అయ్యదేవర కాళేశ్వరరావు ప్రాంగణంలో నిర్వహించిన రెడ్ షర్ట్ వాలంటీర్ జన సేవాదళ్ శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా నందిగామ గాంధీ సెంటర్ లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాలలో సినీ హీరోలకు ఇచ్చిన ప్రాధాన్యత రైతులకు ఇవ్వకపోవడం బాధాకరమని అన్నారు వందల కోట్ల రూపాయల ఖర్చు పెట్టి సినిమాలు తీసి వారి లాబా పేక్ష కొరకు చేసే పనులకు ప్రభుత్వాలు అడ్డగోలుగా సపోర్ట్ చేయటం ఏంటని ప్రశ్నించారు ఓ థియేటర్లో తొక్కిసలాటలో ఆడపడుచు మృతి చెందగా, ఆమె కుమారుడు ప్రస్తుతం కోమా లో ఉన్నారని, ఆ కుమారుడు లేచి నా తల్లి ఎక్కడ అంటే ఏ రాజకీయ పార్టీ అయినా తీసుకురాగలదు అని ప్రశ్నించారు.

ఓ బిజెపి మంత్రి ఒక్కసారైనా బాధిత కుటుంబాన్ని పరామర్శించకుండా ప్రభుత్వం దే తప్పు అని ప్రగల్భాలు పలుకుతున్నారు అటువంటి మంత్రులకు ప్రజలు బుద్ధి



చెబుతారని అన్నారు రైతులు పంటలు పండక అరా కొరగా పండిన పంటలకు కనీస సౌకర్యాలు కల్పించని ప్రభుత్వాలు ఒకవేళ వ్యయ ప్రయాసలు పడి పండించిన పంటలకు గిట్టుబాటు లేక నాన ఇబ్బందులు పడుతుంటే వారిని పట్టించుకోలేని ప్రభుత్వాలు అడ్డగోలుగా సినిమా హీరోలకు ఊడిగం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సిపిఐ శతజయంతి ఉత్సవాలు ప్రారంభ కార్యక్రమం కామ్రేడ్ సూర్యదేవర నాగేశ్వరరావు పుట్టిన గడ్డపై నిర్వహించటం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఘనమైన విజయం సాధించింది. కానీ ప్రజలపై భారం మోపటం ఆపలేదని అన్నారు గత ప్రభుత్వాలు చేసిన తప్పిదాలు అంటూ అధికారం చేపట్టిన ఆరు నెలల్లో రెండుసార్లు విద్యుత్ చార్జీలు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు.

ఆరు నెలల్లో 6000 కోట్లు ఒకసారి 9000 కోట్లు మరోసారి ప్రజలపై కరెంటు చార్జీల రూపంలో 15 వేలకు పట్ల రూపాయల భారం మోపిన కూటమి ప్రభుత్వం ప్రజలకు ఏం చెబుతుందని ప్రశ్నించారు.శత జయంతి ఉత్సవాలలో రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు అక్కినేని వనజ, సిపిఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చుండూరు సుబ్బారావు ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఇక ఎన్నికలన్నీ ఏకగ్రీవమే

- ఏపీ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజి

**ఎర్రగొండపాలెం, మహానాడు:** కూటమి సర్కారు పాలనలో రాష్ట్రంలో ఇక అన్ని ఎన్నికలూ ఏకగ్రీవమే అవుతాయని ఏపీ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజి అన్నారు. పార్టీ ఆదేశాల మేరకు ఎర్రగొండపాలెం నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నీటి సంఘం ఎన్నికల పర్యవేక్షణ కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి తోక జాడించినా ప్రజలు సహకరించే పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలైనా, అనేక ఇబ్బందులు ఎదురవుతున్నా, ప్రతిపక్ష పార్టీలు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నా, చాలా ఓర్పుతో రాష్ట్రాన్ని ఎలా ముందు తీసుకెళ్లాలో, ఇచ్చిన హామీలను ఎలా అమలుపరచాలో, గత ప్రభుత్వం చేసిన అప్పులని ఎలా తీర్చాలో ఆలోచన చేసు కుంటూ సీఎం చంద్రబాబునాయుడు ముందుకు సాగుతు న్నారని బాలాజీ అన్నారు. ప్రజలు కూడా పాలనపై అర్థం చేసుకుంటున్నారు.

జగన్‌ని నమ్మే పరిస్థితులు లేవు కాబట్టి జగన్ కనీసం పోటీ చేసే పరిస్థితిలో లేరు. అందుకే రాబోయే అన్ని ఎన్నికలు ఏకగ్రీవంగా జరుగుతాయి. విజన్ - 2047 కూటమినేతలైన




ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి ముందు చూపునకు నిదర్శనం. గతంలో బాబు 20-20 అంటే చాలామంది నవ్వుకున్నారు. కానీ దాని ఫలితాల్ని చూశామని తెలిపారు.

# 'ప్రజాదర్బార్'కు వచ్చిన సమస్యలు పరిష్కరించాలి

- అధికారులకు మంత్రి జనార్దన్ రెడ్డి ఆదేశం

**బనగానపల్లె, మహానాడు:** ప్రజా సమస్యలను త్వరితగతిని పరిష్కరించాలనే లక్ష్యంతోనే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, కాబట్టి బాధితుల సమస్యలను వేగ వంతంగా పరిష్కరించాలని అధికారులను రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి



బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశించారు. బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో శనివారం ప్రజల నుంచి వచ్చిన అర్జీలను మంత్రి స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆయా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని బాధితులకు హామీ ఇచ్చారు.

అలాగే చట్టబద్ధంగా ఉన్న సమస్యల విషయంలో మంత్రి సంబంధిత అధికారులతో అక్కడిక్కడే ఫోన్ లో మాట్లాడి పరిష్కరించారు. మంత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అర్జీల స్వీకరణ కార్యక్రమానికి నంద్యాల జిల్లా వ్యాప్తంగా వివిధ వర్గాల ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చారు.

### మంత్రిని కలిసిన సాగునీటి సంఘాల నేతలు

బనగానపల్లెలో శనివారం నిర్వహించిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఎన్నికైన నేతలు, పార్టీ కార్యకర్తలు నేడు మంత్రి జనార్దన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సాగునీటి సంఘాలకు ఎన్నికైన నేతలను అభినందించడంతో పాటు వారికి శుభాకాంక్షలు తెలిపారు. సాగునీటి సంఘాలకు ఎన్నికైన నేతలు పంట కాల్వలను అభివృద్ధి చేయాలని, అదే సమయంలో రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆయన వారికి సూచించారు.

# సాగునీటి సంఘాల ఎన్నికల్లో బీజేపీ హవా!

- కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కృషి అభినందనీయం
- విజేతలకు పురందేశ్వరి అభినందనలు

**అమరావతి, మహానాడు:** ఎన్డీయే కూటమి సాగునీటి సంఘాల ఎన్నికల్లో విజయదుందుభి మోగించింది. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ప్రాతినిధ్యం వహిస్తున్న నరసాపురం పార్లమెంట్ పరిధిలో 50 సంఘాల్లో ప్రాతినిధ్యం సాధించగా, బీజేపీ ఎంపీ సీఎం రమేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న అనకాపల్లి లో 50 సంఘాల్లో ప్రాతినిధ్యం సాధించింది. అదేవిధంగా పలు సంఘాల్లో చైర్మన్ లు గా బీజేపీ నేతలు ఎన్నికయ్యారు. సత్య సాయి జిల్లాలో 35 సాగునీటి సంఘాల్లో ప్రాతినిధ్యం సాధించింది. అదేవిధంగా ఇదే జిల్లాలో నాలుగు సంఘాల ఎన్నికల్లో చైర్మన్ లు సాధించారు. తిరుపతి జిల్లాలో 25 సంఘాల ఎన్నికల్లో ప్రాతినిధ్యం లభించింది.

ఏలూరు, కాకినాడ, కోనసీమ జిల్లాలో కూడా పలు సంఘాల్లో ప్రాతినిధ్యం సాధించింది. కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గం లో 20 సంఘాల ఎన్నికల్లో బిజెపి ప్రాతినిధ్యం సాధించింది. కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి ఇక్కడ స్థానికుడు కావడం తో సాగునీటి సంఘాల ఎన్నికల్లో గెలుపు సాధించిడానికి పలువురు రైతు నాయకులను బీజేపీలో చేర్పించి ఎన్నికల లో గెలుపొందడానికి



ఆయన అవిరళ కృషి చేశారు.

రాజమహేంద్రవరం పార్లమెంటు పరిధిలో 30 సంఘాల ఎన్నికల్లో బిజెపి ప్రాతినిధ్యం సాధించింది. విజయవాడ, గుంటూరు నరసరావుపేట, శ్రీకాకుళం, పార్వతీపురం, విశాఖ పట్నంలలో కూడా బీజేపీ అభ్యర్థులు గెలుపు సాధించారు, విజయనగరం జిల్లాలో 38 సాగునీటి సంఘాల ఎన్నికల్లో బీజేపీ ప్రాతినిధ్యం సాధించింది. విజేతలకు పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి అభినందనలు తెలిపారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | ఆదివారం 15, డిసెంబర్ 2024




## బచ్చలమల్లి ట్రైలర్ అదిరిపోయింది-నాని

హీరో అల్లరి నరేష్ 'బచ్చల మల్లి' మునుపెన్నడూ చూడని రగ్గడ్ అవతార్‌లో కనిపిస్తున్నారు. సోలో బ్రతుకే సో బెటర్ ఫేమ్ సుబ్బు మంగాదేవి దర్శకత్వంలో సామజవరగమన, ఊరు పేరు భైరవకోన వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలను అందించిన హాస్య మూవీస్ పతాకంపై రాజేష్ దండా, బాలాజీ గుత్తా నిర్మించిన ఈ రస్టిక్ యాక్షన్ డ్రామా ఈ నెల 20న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా టీజర్, పాటలకు అద్భుతమైన స్పందన వచ్చింది. ఈరోజు నేచురల్ స్టార్ నాని ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. నాని మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ సినిమా టీజర్ చూసి నరేష్ కి ఫోన్ చేశాను. ఈ సినిమా కోసం ఏదైనా చేయాలనే ఉందని చెప్పాను. సినిమా ఖచ్చితంగా హిట్ అయిపోయింది, అది బ్లాక్ బస్టరా, ఏ రేంజ్ అనేది టైం డిసైడ్ చేస్తుందని చెప్పాను. నాకు నేనుగా ఈవెంట్ కి వచ్చాను. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. టీజర్, ట్రైలర్ అదిరిపోయాయి. నరేష్ హిట్ కొడతాడనే నమ్మకం ఆడియన్స్ లో కూడా వచ్చేసింది. సుబ్బు నా ఫేవరెట్ అసిస్టెంట్ డైరెక్టర్. మజ్ను సినిమా చేస్తున్నప్పుడు తను నా వన్ మేన్ ఆర్మీ. ఏ అవసరం ఉన్నా తననే అడిగేవాణ్ణి. ఆ సినిమా సక్సెస్ లో సగం క్రెడిట్ తనది కూడా. అప్పుడే తను డైరెక్ట్ అయిపోతాడని చెప్పాను. తన జర్నీ చూసినప్పుడు చాలా ఆనందంగా ఉంది. బచ్చలమల్లి చూసినప్పుడు సుబ్బు కి తన బలం దొరికిందని అనిపించింది. సుబ్బు బ్లాక్ బస్టర్ కొట్టాలి. ఈ సినిమా ప్రొడ్యూసర్స్ కి బెస్ట్ విషెస్. ఈ సినిమా మ్యూజిక్ డైరెక్టర్ విశాల్ చంద్రశేఖర్ నా ఫేవరెట్. కృష్ణగాడి వీరప్రేమగాథ నా ఫేవరెట్ ఫిలిం. దానికి చాలా అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు . ఈ సినిమాలో మ్యూజిక్ కి చాలా డెప్త్ ఉంది .సుబ్బు ట్రైలర్ లోనే కథ చెప్పాలనుకున్నాడు అంటే సినిమాలో ఇంకెంత హానెస్ట్ గా ప్రయత్నించి ఉంటాడో నేను ఊహించగలను. అమృత ఆల్ ది వెరీ బెస్ట్. టీం అందరికీ ఆల్ ది వెరీ బెస్ట్. ఈ క్రిస్మస్ మనదే. ఈ డిసెంబర్లో పుష్ప2 ఫుల్ మీల్స్ పెట్టేసింది.ఈ డిసెంబర్ ని బచ్చలమల్లి సక్సెస్ తో మంచి డెసర్ట్ గా ఎండ్ చేస్తారని కోరుకుంటున్నాను' అన్నారు.

## అప్పన్నలా రామ్‌చరణ్‌ని చూస్తే షాక్

రామ్ చరణ్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ చేంజర్'. ఈ సినిమాను శ్రీమతి అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్, దిల్ రాజు ప్రొడక్షన్ బ్యానర్స్‌పై దిల్ రాజు, శిరీష్ అన్‌కాంప్రమైజ్డ్‌గా నిర్మించారు. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ మూవీ జనవరి 10న ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ అవుతోంది. ఈ క్రమంలో ముఖ్య పాత్రను పోషించిన శ్రీకాంత్ మీడియాతో చిత్ర విశేషాలను పంచుకున్నారు. ఆయన చెప్పిన సంగతులివే..

**గేమ్ చేంజర్‌లో మీ పాత్ర ఎలా ఉండబోతోంది?**

శంకర్‌తో పని చేయాలని ప్రతీ ఒక్క ఆర్టిస్ట్‌కు ఉంటుంది. గేమ్ చేంజర్ కథ ఆయన ఫస్ట్ హాఫ్ చెప్పినప్పుడు ఈ పాత్రను నాకు ఎందుకు చెబుతున్నారా? అని అనుకున్నాను. సెకండాఫ్ చెప్పిన తరువాత ఈ పాత్రను కచ్చితంగా నేనే చేయాలని అనుకున్నాను. నా కారెక్టర్ అంత బాగా ఉంటుంది. గెటప్ కూడా చాలా కొత్తగా ఉంటుంది. ఈ ప్రోస్థటిక్ మేకప్‌కే నాలుగు గంటలు పట్టేది.

**శంకర్ వర్క్ ఎక్స్‌పీరియెన్స్ ఎలా ఉంది?**

శంకర్ పనితనం గురించి నేను కొత్తగా చెప్పాల్సిన పని లేదు. ఆయన చాలా సహనంతో ఉంటారు. అనుకున్నది అనుకున్నట్టు వచ్చే వరకు టేక్స్ తీసుకుంటూనే ఉంటారు. ప్రతీ కారెక్టర్‌ను ఆయన నటించి చూపిస్తారు.

**గెటప్ చాలా కొత్తగా ఉంది కదా..
ఈ లుక్‌ను ఎలా ఫైనల్ చేశారు?**

మా తండ్రి గెటప్‌ను చూసే నాకు ఈ క్యారెక్టర్ లుక్‌ను ఫిక్స్ చేశారు. గెటప్ వేసుకుని నేరుగా ఇంటికి వెళ్లాను. మా అమ్మ నన్ను చూసి షాక్ అయ్యారు. హేయ్ బేబీ (నవ్వుతూ) అని సరదాగా పిలిచాను. అప్పుడు నా గెటప్ సరిగ్గా సెట్ అయిందని అనుకున్నాను.

**రామ్ చరణ్ మళ్లీ వర్క్ చేశారు? అప్పటికీ ఇప్పటికీ తేడా ఏమైనా గమనించారా?**

గోవిందుడు అందరివాడేలే చిత్రం టైంలో రామ్ చరణ్ చాలా యంగ్. ఇప్పుడు చాలా ఎదిగాడు. గ్లోబల్ స్థాయికి ఎదిగాడు. అప్పన్న పాత్రను రామ్ చరణ్ పోషించిన తీరు చూస్తే అంతా షాక్ అవుతారు. చాలా కొత్తగా అనిపిస్తాడు. రామ్ చరణ్ నన్ను ఎప్పుడూ అన్నా అని ఆప్యాయంగానే పిలుస్తాడు.

**డిఫరెంట్ పాత్రలను ఎంచుకుంటున్నారు కదా..
ఆడియెన్స్ నుంచి ఎలాంటి రెస్పాన్స్ వస్తుందో అని భయపడుతుంటారా?**


దేవర చిత్రంలోనూ డిఫరెంట్ పాత్రను పోషించా. అఖండ టైంలోనూ కాస్త భయపడ్డాను. ఆపరేషన్ దుర్యోధన చిత్రాన్ని రిసీవ్ చేసుకున్నారు. అప్పటి నుంచి నాకు కాస్త ధైర్యం ఏర్పడింది.





## ది రేజ్ ఆఫ్ డాకు'

కథల ఎంపికలో వైవిధ్యం చూపిస్తూ, ప్రతి చిత్రంతో ప్రేక్షకులను ఎంతగానో అలరిస్తూ, వరుస భారీ విజయాలతో దూసుకుపోతున్న గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, తన తదుపరి చిత్రం 'డాకు మహారాజ్'ను బ్లాక్ బస్టర్ దర్శకుడు బాబీ కొల్లి దర్శకత్వంలో చేస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. కేవలం ప్రకటనతోనే 'డాకు మహారాజ్'పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇక ప్రచార చిత్రాలతో ఈ సినిమాపై అంచనాలు రోజురోజుకి పెరిగిపోతున్నాయి.



ముఖ్యంగా ఇటీవల విడుదలైన టైటిల్ టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. నందమూరి అభిమానులతో పాటు, సాధారణ ప్రేక్షకుల్లోనూ ఈ సినిమా చూడాలనే ఆసక్తి రోజురోజుకి పెరుగుతోంది. ఆ ఆసక్తిని రెట్టింపు చేస్తూ, ఇప్పుడు ఈ చిత్ర పాటల పండుగ మొదలైంది. బాలకృష్ణ నటించిన గత మూడు చిత్రాలకు అద్భుతమైన సంగీతం అందించి, ఆ ఘన విజయాలలో కీలక పాత్ర పోషించిన తమన్ 'డాకు మహారాజ్' చిత్రానికి కూడా సంగీతం అందిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి 'ది రేజ్ ఆఫ్ డాకు' పేరుతో మొదటి గీతం విడుదలైంది.

బాలకృష్ణ, తమన్ కలయిక అంటే, సంగీత ప్రియుల్లో ఉండే అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా, తమన్ ఈ పాటను అద్భుతంగా స్వరపరిచారు. 'డాకు మహారాజ్' పాత్ర తీరుని తెలియజేసేలా గీత రచయిత అనంత శ్రీరామ్ అర్థవంతమైన, శక్తివంతమైన సాహిత్యాన్ని అందించారు. "దేగ దేగ దేగ దేఖో వో దేఖో బేగా.. ఈ గుర్రంపై నరసింహం చేసే సవారి ఇదేగా" వంటి పంక్తులతో మరోసారి తన కలం బలం చూపించారు.

లిరికల్ వీడియోలో బాలకృష్ణ మునుపెన్నడూ చూడని సరికొత్త అవతారంలో కనిపిస్తున్నారు.

విజువల్‌గా అద్భుతంగా ఉంది. ప్రతి ఫ్రేమ్‌లో భారీతనం కనిపిస్తోంది.

వెర్సటైల్ హీరో చియాన్ విక్రమ్, మండేలా, మావీరన్ చిత్రాలతో ప్రశంసలు అందుకునన్న క్రియేటివ్ డైరెక్టర్ మడోన్ అశ్విన్‌తో కొలాబరేట్ అవుతున్నారు. ఈ చిత్రానికి ఒచియాన్63 అనే వర్కింగ్ టైటిల్ పెట్టారు, శాంతి టాకీస్ ప్రొడక్షన్ నంబర్ 3 గా నిర్మాత అరుణ్ విశ్వ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అఫీషియల్ గా అనౌన్స్ చేశారు, ఈ కొలాబరేషన్ అశ్విన్ క్రియేటివిటీ, విక్రమ్ పవర్‌హౌస్ పెర్ఫార్మెన్స్ బ్లెండ్ చేసి మరపురాని సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ని అందించనుంది. మడోన్ అశ్విన్ విక్రమ్ కు సరిపోయే సబ్జెక్ట్ తో సరికొత్త అవతార్‌లో చూపించబోతున్నారు. ఈ చిత్రం త్వరలో ప్రారంభమవుతుంది. నిర్మాత అరుణ్ విశ్వ మాట్లాడుతూ.."దేశంలోని అత్యుత్తమ నటులలో ఒకరైన చియాన్ విక్రమ్ సర్‌తో కలిసి మా ప్రొడక్షన్ నంబర్ 3ని ప్రకటించడం మాకు చాలా సంతోషంగా వుంది. అతని ప్రయాణం ఎందరికో స్ఫూర్తినిస్తుంది. మనకు ఎన్నో చిరస్మరణీయమైన పాత్రలు, సంచలనాత్మక చిత్రాలను అందించిన నటుడితో చేతులు కలపడం మాకు గౌరవం. ఈ చిత్రానికి మండేలా, మావీరన్‌లను అందించిన అత్యుత్తమ డైరెక్టర్ మడోన్ అశ్విన్ దర్శకత్వం వహించనున్నారు' అన్నారు.



## విక్రమ్ కొత్త చిత్రం అనౌన్స్‌మెంట్

### విష్ణు మంచు నేతృత్వంలో
## తరంగ వెంచర్స్

నటుడు, నిర్మాత విష్ణు మంచు నేతృత్వంలోని మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ టెక్ ఫండ్ అయిన తరంగ వెంచర్స్‌లోకి హాలీవుడ్ స్టార్ విల్ స్మిత్‌ను దించాలని ప్రయత్నిస్తున్నారు. ఈ మేరకు విల్ స్మిత్‌ని కీలక భాగస్వామిగా చేరడానికి చివరి దశ చర్చలు జరుగుతున్నాయి. %వి%50 మిలియన్ల ఫండ్, మరో %వి%50 మిలియన్ల పొటెన్షియల్ ఎక్స్ టెన్షన్ కోసం పెట్టుబడిగా పెట్టనున్నారు. మీడియా, వినోద రంగంలో ఆవిష్కరణలను పెంచడం లక్ష్యంగా ఈ సంస్థ పని చేస్తుంది. మారుతున్న సాంకేతికతలు, ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌లు, యానిమేషన్, గేమింగ్, బ్లాక్‌చెయిన్, ఎఆర్, విఆర్, ఎఐ వంటి అధునాతన సాంకేతికత వంటి పరిశ్రమలలో పెట్టుబడి పెట్టాలని యోచిస్తున్నారు. ఇది ఎప్పటికప్పుడు అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీతో మద్దతు ఇవ్వడానికి కూడా ప్రయత్నిస్తుంది. ఈ తరంగ వెంచర్స్‌లో భారతీయ నటుడు, నిర్మాత, వ్యవస్థాపకుడు మంచు విష్ణు, దశాబ్దాల అనుభవం ఉన్న ఆర్థిక నిపుణురాలు అదిశ్రీ, రియల్ ఎస్టేట్ అండ్ పెన్షన్ ఫండ్స్‌లో కెనడియన్ పెట్టుబడిదారు ప్రద్యుమన్ ఝులా, భారతీయ మీడియాలో అనుభవజ్ఞుడైన వినయ్ మహేశ్వరి, హాలీవుడ్ స్టార్ విల్ స్మిత్, పెట్టుబడిదారుల సంబంధాలు మరియు ఫండ్ కార్యకలాపాలలో నిపుణులైన దేవేష్ చావ్లా, సతీష్ కటారియా భాగస్వాములుగా ఉండనున్నారు.



Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144